
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States


గన్నవరం విమానాశ్రయంకు చేరుకున్న మెగాస్టార్ చిరంజీవి .రేపు జరగపోయే చంద్రబాబు ప్రమాణస్వీకారం వేడుకకు ప్రత్యేక రాష్ట్ర అతిధిగా హాజరవుతారు

–గన్నవరం, జూన్ 11 (వార్తాప్రభ) :




సంపుటి : 23 | సంచిక : 91 | ది.12-6-2024 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- | ఎడిటర్ : వీర్ల శ్రీ రామ్ యాదవ్






## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం





ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత

# శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రమాణ స్వీకార మహోత్సవం

**తేదీ & సమయం**

జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు

**స్థలం**

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా

## ముఖ్య అతిథులు

భారత ప్రధాని **శ్రీ నరేంద్ర మోదీ గారు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ **శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు**

భారత హోమ్ శాఖామాత్యులు **శ్రీ అమిత్ షా గారు**

## విశిష్ట అతిథులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు **శ్రీమతి పురందేశ్వరి గారు**

జనసేన అధినేత **శ్రీ పవన్ కళ్యాణ్ గారు**

## అందరికీ స్వాగతం... సుస్వాగతం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## వార్తాప్రభ - పంచాంగం

**బుధవారము 12-6-2024**

శ్రీ క్రోధి నామ సంవత్సరం

ఉత్తరాయణం

జ్యేష్ఠ మాసం

శుక్ల పక్షము, గ్రీష్మ ఋతువు

**బుధవారము, జూన్ 12, 2024**

**రాహుకాలం** - 12:16 నుండి 13:55 వరకు

**యమగండం** - 07:20 నుండి 08:59 వరకు

**అమృత ఘడియలు** - 23:33 నుండి 01:19, జూన్ 13 వరకు

**దుర్ముహుర్తం** - 11:38 నుండి 12:30 వరకు

**తిథి** - షష్టి 19:17 వరకు

**నక్షత్రం** - మఖ 02:11 వరకు

## వార్తాప్రభ - రాశిఫలాలు




ఈ నేపథ్యంలో మిగిలిన రాశుల వారికి ఎలాంటి ఫలితాలు రానున్నాయంటే...

**మేష రాశి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు కుటుంబ జీవితంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వ రంగంలో పని చేసే వారికి ఆదాయం ఈరోజు బాగా పెరుగుతుంది. జీవిత భాగస్వామి యొక్క మద్దతు కార్యాలయంలో సహాయకరంగా ఉంటుంది. ఈరోజు ప్రభుత్వ ధనాన్ని పొందే అవకాశాలు ఉన్నాయి.

**వృషభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా లాభదాయకంగా ఉంటుంది. మీ ఖర్చులన్నీ ముగించి, కొంత సొమ్ము పొదుపు చేయగలుగుతారు. కుజుడి ప్రభావంతో ఈరోజు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంటారు. మీ వ్యక్తిగత, పనికి సంబంధించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. మీ జీవితంలో కొన్ని సానుకూల మార్పులొస్తాయి.

**మిధున రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారిలో ఉద్యోగులకు అధికారుల ఆశీస్సులు లభిస్తాయి. మీ పరిధిలో చాలా పురోగతి ఉంటుంది. ప్రభుత్వ పనులతో అనుబంధం ఉన్నవారికి ఈ రోజు గౌరవం పెరుగుతుంది. మీరు లావాదేవీలలో చాలా జాగ్రత్తగా ఉండాలి.

**కర్కాటక రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా రంగాల్లో పురోగతి లభించే అవకాశం ఉంది. మీరు చేసే పనిలో మెరుగైన ఫలితాలొస్తాయి. మీ తండ్రి మార్గదర్శకత్వంలో చేసిన పని విజయవంతమవుతుంది. మీ ప్రేమ జీవితానికి సమయాన్ని కనుగొనగలుగుతారు.

**సింహ రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారికి ఈరోజు సర్వార్ధ సిద్ధి యోగం వల్ల శుభప్రదంగా ఉంటుంది. మతపరమైన పనుల పట్ల మీకు ఆసక్తి పెరుగుతుంది. ఈరోజు మీరు తీసుకునే నిర్ణయం వల్ల మీకు భవిష్యత్తులో మంచి ఫలితాలొస్తాయి. మీ వైవాహిక జీవితంలో విభేదాలన్నీ తొలగిపోతాయి. వ్యాపారులకు ఈరోజు సానుకూల మార్పులొస్తాయి.

**కన్య రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారిలో ఉద్యోగులు ఈరోజు కార్యాలయంలో చాలా జాగ్రత్తగా పని చేయాలి. లేకపోతే శత్రువులు మీకు హాని కలిగించొచ్చు. ఈరోజు మీరు చిన్న కుటుంబసభ్యులతో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు. ఇది మీకు మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

**తులా రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మీ మనసులోని పాత కోరికలు నెరవేరొచ్చు. మీ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయొచ్చు. గతంలో పెట్టిన పెట్టుబడుల నుంచి మంచి ప్రయోజనం పొందొచ్చు. మీ ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుపడుతుంది.

**వృశ్చిక రాశి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు హర్ష యోగం శుభ ప్రభావంతో కుటుంబంలో అవసరాలన్నింటినీ తీర్చుకోగలుగుతారు. మీరు ఇంతకు ముందు ఎక్కడైనా పెట్టుబడి పెడితే రేపు మంచి రాబడులు వస్తాయి. మీ సమస్యకు పరిష్కారం కనుగొంటారు.

**ధనస్సు రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు తమ పిల్లల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. మీ సామాజిక ప్రతిష్ట పెరుగుతుంది. వ్యాపార యాత్రలు విజయవంతమవుతాయి. ఈరోజు విద్యార్థులు తమ ఉపాధ్యాయుల జ్ఞానాన్ని పొందుతారు.

**మకర రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు తమ జీవిత భాగస్వామితో మానసిక ప్రశాంతతను పొందుతారు. ఈరోజు మీకు మిశ్రమ ఫలితాలొస్తాయి. మీరు ఉదయం నుండి ఎనర్జిటిక్‌గా ఉంటారు. ఇది మీ శారీరక బలం, ఉత్సాహాన్ని పెంచుతుంది. అనవసరమైన ఖర్చులు తెరపైకి వస్తాయి. మీరు కోరుకోకపోయినా ఒత్తిడి లేకుండా చేయాల్సి ఉంటుంది.

**మీన రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఏదైనా వ్యక్తి లేదా సంస్థ నుండి రుణం తీసుకోవాలనుకుంటే, సమయం అనుకూలంగా ఉండదు. మరోవైపు ఈరోజు విద్యార్థులకు ఉన్నత విద్యకు మార్గం సుగమం అవుతుంది. మీ కుటుంబ వాతావరణం కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది.

# పోతేపల్లిలో అంగన్వాడి బడిబాట



**మచిలీపట్నం,జూన్ 11 (వార్తాప్రభ) :** మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సిడిపిఓ గ్లోరీ అన్నారు. బందరు మండలం పోతేపల్లి పంచాయితీ పరిధిలో మంగళవారం బడిబాట గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతేపల్లి ఉల్లిపాలెం చిన్నపోతేపల్లి గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో గ్లోరీ మాట్లాడుతూ పలు అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ చేయించారు. అంగన్వాడి పూర్తి చేస్తున్న పిల్లలకు ఫ్రీ స్కూల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని గర్భవతులు బాలింతలు ఇతర తల్లులు పిల్లలతో పాటు అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీ కరుణ శివ పావని శివ పార్వతి సూపర్వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రేమల్లి గ్రామంలో నందమూరి బాలయ్య బాబు జన్మదిన వేడుకలు



**హనుమాన్ జంక్షన్,జూన్ 11 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం రేమల్లె గ్రామం లో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నటసింహం హిందూపురం ఎమ్మెల్యే బాలయ్య బాబు జన్మదిన వేడుకలను మండల తెలుగు యువత అధ్యక్షుడు కలపాల సత్యనారాయణ (పింకీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా విచ్చేసిన గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సోదరులు సతీష్ ముందుగా ఎన్టీఆర్, నందమూరి హరికృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి బాలయ్య అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దయల రాజేశ్వర రావు,పార్టీ ప్రధాన కార్యదర్శి పుట్ట సురేష్,రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మల్పూరి సాయి కల్యాణి, ,రాష్ట్ర తెలుగు రైతు నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు యనమదల శ్రీనివాసరావు, గుడివాడ విజయనంద్, మండల తెలుగు యువత అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు వల్లపట్ల శివరామకృష్ణ, కలపాల రాధాకృష్ణ, కలపాల కుమార్, వడ్లమూడి కృష్ణ రావు, కొనకాల దుర్గారావు, కొల్లూరు చంద్రకాంత్ , చెబత్తిన వంశీ,సోడిమెళ్ళ శేషు,రాజబాబు, తొమ్మండ్రు మహేష్,లోకేష్, పొలిమెట్ల నవీన్, బాలయ్య బాబు అభిమానులు పెద్ద ఎత్తులో పాల్గొన్నారు.

# నేడు కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం

**● హర్షం వ్యక్తం చేసిన పెడన మండల జనసేన పార్టీ**



**పెడన,జూన్ 11 (వార్తాప్రభ) :** టిడిపి బిజెపి జనసేన కూటమి ప్రభుత్వం బుధవారం నాడు కేసరపల్లిలో ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో జనసేన పెడన మండల అధ్యక్షుడు ఊసా వెంకయ్య అభినందనలు తెలిపారు.నూరు శాతం ఫలితాలు సాధించిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించడం కూడా అభినందనీయమన్నారు. రాష్ట్రంలో గెలుపొందిన 21 మంది జనసేన శాసనసభ్యులకు వెంకయ్య అభినందనలు తెలిపారు. పార్టీ పరంగా కష్టపడిన నాయకులకు న్యాయం చేయాలని వెంకయ్య పవన్ కళ్యాణ్ కు విజ్ఞప్తి చేశారు.

# సైబర్ నేరాలపై ఎస్ బి ఐ లో అవగాహన సదస్సు



**నూజివీడు,జూన్ 11 (వార్తాప్రభ) :** నూజివీడు పట్టణంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా బ్రాంచ్ లో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ ఎం హనుమంతనాయక్ మాట్లాడుతూ ఖాతాదారుల బలహీనతలను ఆసరాగా చేసుకుని బ్యాంకు నుండి ఫోన్ చేస్తున్నామని చెప్పి, సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల వద్ద నుండి ఓటీపీ నెంబర్ తెలుసుకొని బ్యాంకు ఖాతాలోని నగదును చోరీ చేస్తున్నారన్నారు. అదేవిధంగా కేవైసీ అప్డేషన్ కోసం, లాటరీ తగిలిందని, మీకు లోన్ ఎలిజిబిలిటీ ఉందని తదితర కారణాలతో మోసం చేయడానికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తుంటారన్నారు. వారి మోసపూరిత మాటలకు లొంగి, అత్యాశకు పోయి ఓటిపి చెప్పవద్దన్నారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు వెంటనే తెలియజేసి, అలాంటి ఫోన్ నెంబర్లను బ్లాక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల మాటలకు మోసపోయి నగదు బదిలీ చేసినట్లయితే, సదురు బ్యాంకులో సమాచారం అందించి లావాదేవీలను వెంటనే నిలుపుదల చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

# మైనార్టీలకు అండగా టిడిపి

**● పశ్చిమ ఇబ్రహీంపట్నం లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో టిడిపి విజయోత్సవం**



**ఇబ్రహీంపట్నం,జూన్ 11 (వార్తాప్రభ) :** టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడు మైనార్టీలకు అండగా ఉంటుందని, చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని తెలిపారు తెలుగుదేశం పార్టీ నాయకులు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం 20వ వార్డులో తెలుగు దేశం పార్టీ ఘనవిజయాన్ని పురస్కరించుకొని విజయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, మున్సిపాలిటీ టిడిపి చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు, మండల అధ్యక్షుడు రామినేని రాజా, కౌన్సిలర్ చనుమొలు నారాయణ పాల్గొన్నారు. స్థానిక జండా సెంటర్ చెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మసీదు సెంటర్లో భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద ముస్లింకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, మైనార్టీల అభివృద్ధి మరియు సంక్షేమం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని తెలిపారు. స్థానిక ముస్లిం నాయకులు మాట్లాడుతూ గత పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎన్నో సంక్షేమ పథకాలు రద్దు చేయబడినయని, వాటి పునరుద్ధరణతో మళ్ళీ ముస్లింలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. అతిధులను ముస్లిం సోదరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ముస్లిం నాయకులు షేక్ సర్వర్ సాహెబ్, ముస్తఫా, షకీల్, కరీముల్లా,గాల్షిద్, మహబూబ్ సుభాని,రఫీ, షరీఫ్,హజారి తదితరులు పాల్గొన్నారు.

# దివంగత తలసాని శంకర్ యాదవ్ అంతిమయాత్రలో పలువురు ప్రముఖులు





**హైదరాబాద్,జూన్ 11 (వార్తాప్రభ) :** సోమవారం దివంగతులైన సికింద్రాబాద్ ప్రముఖులు తలసాని శంకర్ యాదవ్ అంతిమ యాత్రలో పలువురు పాల్గొన్నారు ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు భేరి రామచంద్ర యాదవ్ తన మిత్రబృందం తో పాల్గొని నివాళు లర్పించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కు సొంత అన్నయ్య దివంగత తలసాని శంకర్ యాదవ్. . ఉదయము వెస్ట్ మారేడుపల్లి నుండి అంతిమయాత్ర మొదలయింది. సికింద్రాబాద్ బన్సీలాల్ పేట్ స్మశాన వాటిక వరకు ఊరేగింపుగా సుమారుగా నాలుగు గంటలపాటు అంతిమయాత్ర జరిగింది. మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్ రెడ్డి , డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ , వాడి కౌశిక్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మారబోయిన బిక్షపతి యాదవ్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్రర్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, పెద్ద శ్రీశైలం యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు రవి కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, మండలి రాధాకృష్ణ యాదవ్, మారబోయిన సదానంద్ మాదాపూర్ ప్రభాకర్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్,బీసీ నాయకులు నక్కా ఉమేష్ యాదవ్, నక్కా శ్రీనివాస్ యాదవ్ మరియు మిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున అంతిమ యాత్రలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రముఖులు, బీసీ, యాదవ పెద్దలు, అభిమానులు, యాదవ సమాజము, బీసీ సమాజం బంధుమిత్రులు కాలినడకన ఊరేగింపులో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. దహన సంస్కారంలో పాల్గొని అందరూ శ్రద్ధాంజలి ఘటించారు. శంకర్ యాదవ్ ముందా మార్కెట్ చైర్మన్ గా అనేక సేవలు చేయడం జరిగింది. మొండ మార్కెట్ కూరగాయల హమాలీ సంఘం సంక్షేమ సంఘానికి, సంఘ సభ్యులకు ఎన్నో సేవలు చేసినందుకు వాళ్ళందరూ మొండా మార్కెట్లో ఊరేగింపుగా అంతిమయాత్రలో పాల్గొనడం జరిగింది. శంకర్ యాదవ్ చేసిన సేవలు అమోఘమని, తలసాని శ్రీనివాస్ యాదవ్ కి అన్నగా ఉండడమే కాకుండా ఎవ్వరు పిలిచినా యాదవ సమాజానికి బీసీ సమాజానికి అన్నా అంటే నేనున్నా అని ప్రతి ఒక్కరి పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, అన్ని సేవా కార్యక్రమంలో పాల్గొనడం ప్రత్యేక విశేషమనీ ఈ సందర్భంగా నివాళులు అర్పిస్తూ బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

# పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సు అడ్మిషన్స్ గడువు పెంపు

**రాజమహేంద్రవరం,జూన్ 11 (వార్తాప్రభ) :** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ద్వారా శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా కానవరం వారిచే పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో ప్రవేశాల దరఖాస్తులకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించామని వీసీ ఆచార్య కె పద్మరాజు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా ఇన్ యోగా వన్ ఇయర్ పార్ట్ టైమ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన అడ్మిషన్స్ గడువును 30వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఆలస్య రుసుముతో జూలై 8వ తేదీ వరకు ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలియజేశారు. నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంతో పాటు శ్రీ రాపర్తి రామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా కానవరంలో 50 సీట్లు చొప్పున కోర్సును అందిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు పీజీ డిప్లొమా ఇన్ యోగా కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు పొడిగించిన తేదీలలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ ను సంప్రదించాలని తెలియజేసారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి




**హనుమాన్ జంక్షన్,జూన్ 11 (వార్తాప్రభ) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఆనవాయితీగా మార్చుకోవాలని రాణా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు సుంకర సాంబశివరాయల్ సూచించారు. రానా వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు అమ్మిశెట్టి రానా ప్రతాప్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యచరణ చేపట్టామన్నారు. ఆదివారం పెరికిడులో తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టాపు సత్యవతి ఇంటి ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకడు గొట్టాపు ప్రవీణ్, సంపంగి శ్రీనివాసరావు, మజ్జి రమేష్, గొర్రెల సత్యనారాయణ, గొట్టాపు సాయి గీతాంజలి పాల్గొన్నారు.

# రెయిన్ బో క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల అందజేత



**కాకినాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ - డిస్ట్రిక్ట్ 106 - రెయిన్ బో క్లబ్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ అలై బాలా త్రిపుర సుందరి అధ్యక్షతన ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్ గవర్నర్ అలై వనం శ్రీనివాసరావు చేతుల మీదుగా గత రెండు ఏళ్ళుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు అండగా నిలుస్తూ.. రెయిన్ బో క్లబ్ తరుపున రెండు నెలలకు సరిపడే విధంగా నిత్యవసర వస్తువులు,25 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ వనం శ్రీనివాసరావు,జోన్ చైర్మన్ లక్ష్మి నాగేంద్ర, ప్రెసిడెంట్ బాలా త్రిపుర సుందరి,జాయింట్ సెక్రటరీ దుర్గా దేవి, క్లబ్ పీఆర్వో మణి,కుమారి తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 కోట్లతో బయోమెథనేషన్ ప్లాంట్ పనుల వేగవంతానికి చర్యలు కమిషనర్ జే.వెంకటరావు



**కాకినాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** తడి చెత్త నుంచి సీఎన్జీ గ్యాస్‌ను ఉత్పత్తిచేసే బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభం కానుందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే.వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులను మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చొల్లంగి గ్రామంలో 6.45 ఎకరాల విస్తీర్ణంలో ఈ బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణమవుతుందన్నారు. తడిచెత్త నుంచి సీఎన్జీ గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు సంబంధించి హెచ్ఆర్ స్క్వేర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చామన్నారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ సమస్యలు,ఇతర అంశాలను సత్వరమే పరిష్కరించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతీ రోజు 40 టన్నుల తడి చెత్తను ప్రోసెసింగ్ చేసి దాని ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేసేందుకు ఈప్లాంట్ ఏర్పాటవుతుందన్నారు. ఈ సందర్భంగా బయోమెథనేషన్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రగతిపై అక్కడి అధికారులు, కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులతో కమిషనర్ చర్చించారు. ఆయన వెంట డిఈ రామారావు,ఇతర అధికారులు ఉన్నారు.

# ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**కాకినాడ రూరల్,జూన్ 11 (వార్తాప్రభ) :** రమణయ్యపేట సుందర్ నగర్ లో రిషి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ ఇందు గల ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ రిషి స్మారకార్థం ప్రతి ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్నామని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే తపన ప్రతి విద్యార్థిలోనూ కలగాలని ప్రసాద్ నాయుడు తెలిపారు. అనంతరం విద్యార్థులకు విందునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు -టి.డి.పి.నేత కాపా శ్రీనివాసరావు






**నూజివీడు,జూన్ 11 (వార్తాప్రభ) :** సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో నూజివీడు మాజీ ఏఎంసి చైర్మన్, నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షులు కాపా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందే తాను కూటమి అభ్యర్థులు 160 స్థానాల్లో విజయం సాధిస్తారని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కళ్యాణ్, భారత ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసిపి అరాచక పాలనకు, సైకో జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన దోపిడీపై రాష్ట్ర ప్రజలు తమ ఓటు హక్కును కూటమి అభ్యర్థులకు అనుకూలంగా వేసి ప్రతీకారం తీర్చుకున్నారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంతో పాటు చంద్రబాబు స్వప్నమైన టిడ్కో గృహాలను సైతం పూర్తిచేసిన లబ్ధిదారులకు అందించడానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథిని, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కాపా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. అపారమైన పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు, క్రమశిక్షణ, వివేకంతో ముందుకు తీసుకు వెళ్ళగలిగిన పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని కాపా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా అధికారంలో విచక్షణ రహితంగా టిడిపి కార్యకర్తలపై దాడులు, నాయకులపై అక్రమ కేసులు పెట్టారని, ప్రస్తుతం కూటమి నాయకులు, కార్యకర్తలు ఆవేశానికి పోయి వైకాపా కార్యకర్తలపై ఎలాంటి దాడులకు పాల్పడవద్దని, సమయనం పాటించాలని కాపా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధించడానికి ఇప్పటినుండే టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు పనిచేయాలని సూచించారు.

**రావిచర్ల సర్పంచ్ గారి తాలూకా:** నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ద్విచక్ర వాహనాల నెంబర్ ప్లేట్లు విభిన్నంగా మారుతున్నాయి. ప్రత్యేకించి రావిచర్ల సర్పంచ్ గారు తాలూకా అంటూ కొందరు కాపా శ్రీనివాసరావు అభిమానులు తమ ద్విచక్ర వాహనాలకు నెంబర్ ప్లేట్లను రావిచర్ల సర్పంచ్ గారి తాలూకా అంటూ మారుస్తున్నారు. అదేవిధంగా నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గారి తాలూకా అంటూ కొందరు తమ ద్విచక్ర వాహనాల నెంబర్ ప్లేట్లపై స్టిక్కరింగ్ చేపిస్తున్నారు. దీంతో కంప్యూటర్ స్టిక్కరింగ్ దుకాణాలకు డిమాండ్ జరిగింది.





# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలు, పరిష్కార అవగాహన కలిగి, జర్నలిజం పట్ల ఆసక్తి గల వారు ఈ క్రింది కేంద్రాల్లో "వార్తప్రభ" దినపత్రికకు స్టాఫర్లగా పనిచేయుటకు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత.

★ ఏలూరు ★ గుంటూరు ★ రాజమండ్రి

★ తిరువూరు ★ పామర్రు ★ అవనిగడ్డ ★ విజయవాడ తూర్పు

ఎడిటర్ : "వార్తప్రభ"

డోర్ నెం. 30-22-3/11, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన కొత్తవంతెన రోడ్డు, సీతారామపురం, విజయవాడ - 520004

సెల్ : 9347993188




## అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని: చంద్రబాబు

- విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేసుకుందామని పిలుపు
- హోదా సేవ కోసమే పదవి తప్ప పెత్తనం కోసం కాదు
- కేంద్రం సహకారంతో పోలవరం పూర్తి చేస్తాం






(ఇస్కా రాజేష్ బాబు)

**విజయవాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇకపై మూడు రాజధానులు అంటూ ఆటలాడే పరిస్థితి రాష్ట్రంలో ఉండదని తేల్చి చెప్పారు. విశాఖపట్నంను ఆర్థిక, ఆధునిక రాజధానిగా అభివృద్ధి చేసుకుందామంటూ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. కూటమి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు చెబుతూ ప్రజా తీర్పును గౌరవించి, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తామందిరిపైనా ఉందన్నారు.

**గత పాలనలోనే పోలవరం దాదాపుగా పూర్తి..** సమష్టిగా ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం ఎంతో అవసరమని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని వివరించారు. నిజానికి 2014లో అధికారంలోకి వచ్చి ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించినపుడే పోలవరం ప్రాజెక్టు పనులను 72 శాతం పూర్తిచేశామని చంద్రబాబు చెప్పారు. వరదలకు డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని చెబుతూ.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి నదులను అనుసంధానించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతీ ఎకరానికీ నీళ్లందిస్తామని హామీ ఇచ్చారు.

**గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం శిథిలమైంది..** గత ప్రభుత్వ హయంలో ఐదేళ్లలోనే రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని చంద్రబాబు ఆరోపించారు. రాష్ట్రంలో సమస్యల సుడిగుండంలో చిక్కుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు దెబ్బతిన్నాయని, రైతులు అప్పుల పాలయ్యారని చెప్పారు. సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను చక్కదిద్దే పని ప్రారంభిస్తామని వివరించారు. కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మకంగా ముందుకు వెళతామని చెప్పారు. 'సీఎం పదవి హోదా కోసమే తప్ప పెత్తనం కోసం కాదు. సీఎం కూడా మామూలు మనిషే.. అలాగే మీ ముందుకు వస్తా. మిత్రుడు పవన్ కల్యాణ్ తో పాటు మేమంతా సామాన్యులుగానే ప్రజల వద్దకు వస్తాం' అని చెప్పారు.

**ప్రతి అడుగూ ప్రజాహితమే..** సీఎం పర్యటనల సందర్భంగా షాపులు, రోడ్లు మూసివేయడం, పరదాలు కట్టడం లాంటివి ఇకపై రాష్ట్రంలో కనిపించబోవని చెప్పారు. సిగ్నల్స్ దగ్గర వాహనాలను ఆపేయడం జరగదన్నారు. 'ఐదు నిమిషాలు నాకు లేటైనా పర్వాలేదు కానీ ప్రజలకు అసౌకర్యం కలగవద్దని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు చంద్రబాబు తెలిపారు. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికీ భంగం కలగదని, ప్రతీ నిర్ణయం, ప్రతీ అడుగు ప్రజాహితం కోసమే ఉంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు మమ్మల్ని ఆహ్వానించండి
## గవర్నర్ ను కోరిన కూటమి నేతలు

- ఏపీ గవర్నర్ ను కలిసిన కూటమి నేతలు
- కూటమి తరపున చంద్రబాబును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నట్లు వెల్లడి
- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కు లేఖ సమర్పణ



(ఇస్కా రాజేష్ బాబు)

**విజయవాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ మంగళవారం సమావేశం అయ్యారు. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల తరఫున సభానాయకుడిగా టీడీపీ అధినేత, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గవర్నర్ కు 164 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను సమర్పించారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీఏ కూటమిని ఆహ్వానించాలని కోరారు. అనంతరం రాజ్ భవన్ వెలుపల అచ్చెన్నాయుడు, పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. తాము చేసిన విజ్ఞప్తికి గవర్నర్ సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి చెప్పారు. చట్ట నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తానని గవర్నర్ తమకు తెలియజేశారన్నారు.

## సింగరేణి కార్మిక కుటుంబాలకు శుభవార్త

- కారుణ్య నియామకాల వయోపరిమితి (ఏజ్ లిమిట్) పెంచుతూ నిర్ణయం
- కార్యరూపం దాల్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ

**హైదరాబాద్,జూన్ 11 (వార్తాప్రభ) :** సింగరేణి కార్మిక కుటుంబాలు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న కారుణ్య నియామకాల వయో పరిమితి పెంపు కార్యరూపం దాల్చింది. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ అకాల మరణం చెందిన వారి కుటుంబాల్లో ఒకరికి, అనారోగ్యంతో (మెడికల్ అన్‌ఫిట్) ఉద్యోగ విరమణ చేసిన వారి పిల్లలను బదిలీ కార్మికునిగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలోకి తీసుకుంటారు. గతంలో 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారినే కారుణ్య నియామకాల కింద తీసుకునే వారు. కరోనా కాలంలో రెండేళ్ల పాటు వైద్య పరీక్షలు నిర్వహించకపోవడంతో సింగరేణి కార్మికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారుణ్య నియామకాల వయో పరిమితిని పెంచుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. వయో పరిమితి సడలిస్తూ ఇచ్చిన ఉత్తర్వును 2018, మార్చి 9వ తేదీ నుంచి అమలు చేస్తారు. ప్రస్తుత ఉత్తర్వుతో సింగరేణిలో వందలాది కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

## ప్రజలతో శెభాష్ అనిపించుకునేలా పాలన చేద్దాం

- ఈ విజయం ప్రతీకారం కోసం కాదు...అభివృద్ధి, సంక్షేమం కోసం
- ప్రణాళికబద్ధంగా నియోజక వర్గాల సమస్యలను పరిష్కరిద్దాం
- ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి
- వ్యక్తిగత విమర్శలు పూర్తిగా నిరోధించాలి
- జనసేన పార్టీ శాసనసభ పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం మాట్లాడిన పవన్ కళ్యాణ్





**విజయవాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** ప్రజలు అందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదు. పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కాదు. వారు మనల్ని మనస్ఫూర్తిగా నమ్మి అఖండ విజయాన్ని అందించారంటే వారికి అత్యుత్తమ పాలన ఇవ్వాలని చెప్పడమే. నేను ఎప్పుడూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని తప్పి ప్రవర్తించలేదు. గత ప్రభుత్వానికి ఇది అర్థం కాలేదు. ఇప్పుడు అధికారంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించే బాధ్యతను తీసుకుంటామ'ని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ శాసనసభ పక్ష మొదటి సమావేశం జరిగింది. జనసేన శాసనసభ పక్ష నాయకుడుగా పవన్ కళ్యాణ్ ని పార్టీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదట పవన్ కళ్యాణ్ పేరును పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించగా సభ్యులంతా ఏకగ్రీవంగా బలపరిచారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "జనసేన పార్టీ విలువలను, స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా పని చేయాలి. పగలు, ప్రతీకారాలకు సమయం కాదు. దీనిని శ్రేణులకు కూడా అర్థమయ్యేలా నాయకులు తెలియజెప్పాలి.

**ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి ..** ప్రజలు జనసేన పార్టీని నమ్మి పెద్ద బాధ్యతను ఇచ్చారు. దానిని సక్రమంగా నిర్వర్తించాలి. ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి. నాతో సహా పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా దానిని బాధ్యతగా తీసుకుందాం. భారతదేశంలో ఎంతోమంది రాజకీయ పార్టీలను దశాబ్దంపాటు ఏ అధికారం లేకుండా నడిపిన దాఖలాలు లేవు. జనసేన పార్టీ ప్రయాణం ప్రజల ప్రేమ, అభిమానం, నమ్మకం అనే ఇంధనంతోనే నడిచింది. నేను ఢిల్లీ వెళ్లినప్పుడు చాలా మంది జాతీయ స్థాయి నాయకులు- ఇంతకాలం పాటు ఏ అధికారం లేకుండా పార్టీని ఎలా నడిపారని అడుగుతున్నారు. ఇది పూర్తిస్థాయిలో జన సైనికులు, వీర మహిళలు సాధించిన విజయం. ఈ స్ఫూర్తిని వారి నమ్మకాన్ని మరింత నిలబెట్టుకునేలా ఇకముందు కూడా మన ప్రయాణం ఉండాలి.

**నియోజకవర్గాల్లో ప్రాధాన్య అంశాలను గుర్తించండి..** పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా మొదట నియోజకవర్గంలో కీలకమైన సమస్యలు, ప్రజల ఇబ్బందులు పడుతున్న విషయాలను గుర్తించాలి. ఏవి మొదట ప్రాధాన్య అంశాలో తెలుసుకోండి. వాటిని తీర్చేందుకు ప్రాధాన్యం ఇద్దాం. ఒక వేళ కేంద్రంతో ముడిపడిన అంశాలు ఉంటే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి పూర్తయ్యేలా చొరవ తీసుకుందాం. పార్టీ తరపున కూడా ప్రత్యేక కమిటీగా ఏర్పడి ప్రజల సమస్యలు తీర్చేందుకు సమన్వయం చేసుకుందాం. 2019 తర్వాత ప్రజలు అప్పటి ప్రభుత్వానికి ఎందుకు ఓటేశామా అనే ఆవేదనతో 2024లో మనకు గొప్ప


- 7లో







# ఎడిటోరియల్

## బాబు నుంచి ఏపీ ఏమి ఆశిస్తోంది ?

ఏపీ ప్రజలు పవిత్రమైన బాధ్యతను కూటమి మీద ఉంచారు అని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే అమరావతినే రాజధానిగా ఆయన ఎన్డీయే సమావేశంలో ప్రకటించారు. ఇది ఆయన కరెక్ట్ గానే ప్రజల నాడిని అంచనా వేసి చెప్పారనుకోవాలి. ఏపీలో అభివృద్ధి లేదు అన్నది జనంలో ఉన్న భావన. కనీసం చెప్పుకునేందుకు రాజధాని కూడా లేదు అని కూడా అయిదు కోట్ల జనం తీవ్ర ఆవేదన చెందారు.అలా వారి ఆవేదన అసంతృప్తి ఒక కచ్చితమైన తీర్పు రూపంలో బయటకు వచ్చింది. చాలా సేపు ఎన్డీయే సమావేశంలో మాట్లాడిన చంద్రబాబు ఎక్కువగా అభివృద్ధి గురించే ప్రస్తావించడం గమనార్హం. ఆయన విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కర్నూల్ ని ఏ మాత్రం తక్కువ కాకుండా అభివృద్ధి చేస్తామని కూడా పేర్కొన్నారు.ఈ విధంగా మూడు ప్రాంతాలలో సమగ్రాభివృద్ధి టీడీపీ కూటమి లక్ష్యమని కూడా ఆయన స్పష్టంగానే చెప్పారు. అదే సమయంలో సంక్షేమం గురించి బాబు పెద్దగా మాట్లాడలేదని చర్చ సాగుతోంది. కూటమి సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలను ఇచ్చింది. వైసీపీ కంటే రెట్టింపు పథకాలు అని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ప్రచారం చేశారు.అయితే దాని మీద మాత్రం ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా బాబు ఎక్కువగా మాట్లాడలేదు అని అంటున్నారు. పైగా బాబు చాలా ఆసక్తికరమైన అంశాలనే చెప్పారు. ఏపీలో ఎంత అప్పు ఉంది అన్నది తెలియదు అన్నారు. దిగేదాకా లోతు తెలియదని అందువల్ల మొత్తం స్టడీ చేయాలన్నది బాబు మాటల వెనక ఉన్న అర్థంగా భావించాలి.ఏపీలో అప్పుల కుప్పగా అంతా ఉందని బాబు చెప్పుకొచ్చారు. ఏపీలో అన్ని వ్యవస్థలు శిథిలం అయ్యాయని మొత్తం మీద చూస్తే మొదటి నుంచి పని ప్రారంభించుకోవాలని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ భారీ కృషిలో తనకు అంతా సహకరించాలని ఆయన కోరారు. ఒక విధంగా చెప్పలంటే బాబు ముందు అభివృద్ధి సంక్షేమం రెండూ ఉన్నాయి.మరీ ముఖ్యంగా బాబుని ప్రజలు ఎన్నుకుంది అభివృద్ధి కోసం అని కూడా అంటున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం, అమరావతి రాజధాని పరిపూర్తి చేయడం వంటివి రానున్న అయిదేళ్లలో బాబు చేస్తే ఆయనకు తిరుగు ఉండదని కూడా అంటున్నారు. ఇక సంక్షేమ పథకాల విషయంలో చూస్తే ఎన్నో అమలు చేసిన జగన్ ని అయిదేళ్ళ తరువాత జనాలు ఓడగొట్టారు అంటే వాటి గురించి కూడా నిశిత పరిశీలన చేయాల్సి ఉంది అని అంటున్నారు.ఆపన్నులకు అణగారిన వర్గాలకు సంక్షేమం తప్పనిసరి అదే టైం లో దూబారా చేసి పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేయాలనుకోవడం మంచింది కాదు అన్న సూచనలు వస్తున్నాయి. జగన్ సంక్షేమ పథకాలు చాలా వరకూ అనర్హులకు కూడా వెళ్లాయని చెబుతున్నారు.ఎవరినీ కాదనకుండా అందరికీ పథకాలు ఇవ్వడం వల్ల రాష్ట్రం అప్పుల కుప్ప అయింది అని అంటున్నారు. చంద్రబాబు అలా కాకుండా అర్హులను కచ్చితంగా ఎంపిక చేసి అవసరం ఉన్న వారికే పథకాలు ఇవ్వడం మంచిది అని అంటున్నారు. అంతే తప్ప అప్పులు తెచ్చి పథకాలు ఇవ్వాల్సింది లేదు అన్న వాదన కూడా ఉంది. మొత్తం మీద చూస్తే అటు అభివృద్ధి ఇటు సంక్షేమం విషయంలో కొత్త ప్రభుత్వం బ్యాలెన్స్ తో వెళ్తేనే ఏపీ ప్రగతి బాటన సాగుతుంది అని అంటున్నారు.

## రాగం సుజాత యాదవ్, నాగేందర్ యాదవ్ ల ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత చండీయాగం

■ పాల్గొన్న ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,జూన్ 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి లోని గుల్మోహర్ పార్క్ నేతాజీనగర్ యందు "శ్రీ సాయి బృందావన" క్షేత్రములో రాగం సుజాత నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆలయ 14వ వార్షికోత్సవ మహోత్సవంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ముఖ్య అతిథులుగా విచ్చేసారు.ఆలయ అర్చకులు ఎమ్మెల్యే,కార్పొరేటర్ ను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం కార్పొరేటర్ శ్రీ శ్రీ శ్రీ మాధవనంద సరస్వతీ స్వామి వారి ఆశీస్సులతో "శ్రీ రుద్ర సహిత చండి యాగం" లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి జీ తెలుగు "శ్రీకరం శుభకరం" తేజస్వి శర్మ,హిమాలయ తపస్వి సిద్ధ యోగి ముఖ్య అతిధులుగా విచ్చేసి భక్తులను ఆశీర్వాదించారు.వారిని కార్పొరేటర్ గౌరవంగా సన్మానించి వారి ఆసిస్సులు అందుకున్నారు.ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ పంతులు బాబా వారి సేవలో 25 సంవత్సరాలు (సిల్వర్ జూబ్లీ) సందర్భంగా వారికీ స్వర్ణ కంకణం ప్రధానం చేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు,రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్,రాగం అభిషేక్ యాదవ్,గోపాల్ యాదవ్,రాజు,పిల్లి యాదగిరి, ఇంగయ్య గౌడ్,నాగేష్, నారాయణ,మల్లికార్జున, రంజిత్,మహేష్,నరసింహ, సత్యనారాయణ,కుటుంబ రావు,రవి కిరణ్,తుకారాం, చంద్రకళ,దివ్య,కళ్యాణి, కుమారి,భారీ ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## ప్రవేశ పాసులు ఉన్న వాహనాలకు (బస్సులు/కార్లు) మాత్రమే అనుమతి

### విజయవాడ నగర పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ స్పష్టంగా వెల్లడి



**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నేడు (బుధవారం) నారాచంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నేపథ్యంలో విజయవాడ నుండి, ఇతర ప్రదేశాల నుండి గన్నవరం ఫంక్షన్ ప్లేస్ కు ప్రవేశ పాసులు ఉన్న బస్సులు/కార్లను మాత్రమే అనుమతించడం జరుగుతుందని విజయవాడ నగర పోలీసు కమిషనర్ పి హెచ్ డి రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.పాసులు లేని ఇతర వాహనాలు అనుమతించబడదని తేల్చిచెప్పారు.

విజయవాడలో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, అంబేద్కర్ విగ్రహం వద్ద, బస్ స్టాండ్, 4.రైల్వే స్టేషన్, లెనిన్ సెంటర్, పటమట లోని జెడ్.పి.బాయ్స్ హై స్కూల్,అజిత్ సింగ్ నగర్ లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింకానా గ్రౌండ్స్ మరియు విధ్యధరపురం మినీ స్టేడియం ఈ 9 ప్రాంతాల నుండి సి ఎమ్ ప్రమాణ స్వీకర కార్యక్రామాన్ని ఎల్.ఈ.డి.స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల వారు ఆయా ప్రదేశాలకు వెళ్లి కార్యక్రమాన్ని వీక్షించవచ్చని తెలియజేశారు.ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమత్రులు, కేంద్ర మంత్రులు, వి.వి.ఐ.పి.లు, వి.ఐ.పి.లు మరియు ప్రముఖులు ఈ రహదారుల గుండా ప్రయాణం చేస్తారు. కావున వారికి ట్రాఫిక్ పరంగా మరియు భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్త్ ఏర్పాట్లు చేసామని, ప్రశాంత వాతావరణంలో పాసులు కలిగిన ఆహ్వానితులు సభా స్థలానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేసామని ఆయన తెలిపారు.

**విజయవాడ నగరము లోని సాధారణ వాహనములు మళ్ళింపులు:**విజయవాడ నుండి ఏలూరు మరియు విశాఖపట్నం వైపుకు వెళ్ళు కార్లు, ద్విచక్ర వాహనములు, ఆర్.టి.సి. బస్సులు ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు బెంజ్ సర్కిలు నుండి కంకిపాడు–పామర్రు–హనుమాన్ జంక్షన్–ఏలూరు వైపుకు పంపబడునని, ఓ ల్డ్ పి సి ఆర్ జంక్షన్, ఏలూరు రోడ్, హొటల్ స్వర్ణ పాలెస్ , రామవరప్పాడు రింగ్,ఇన్నర్ రింగ్ రోడ్,ఔటర్ రింగ్ రోడ్డు( ఓ ఆర్ ఆర్ ) , హనుమాన్ జంక్షన్, ఏలూరు వైపుకు వెళ్ళాలని చూసించారు.గొల్లపూడి ఔటర్ రింగ్ రోడ్డు (ఓ ఆర్ ఆర్ ) , గన్నవరం ,హనుమాన్ జంక్షన్ వైపుకు వెళ్లాలని సి పి సూచించారు.

## నేటినుండి ఏపిఎస్ ఆర్టీసీ వారు విద్యార్థులకు బస్ పాస్ లు ఇవ్వడానికి రంగం సిద్ధం

**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న తరుణంలో బస్ పాస్ పొందగోరు విద్యార్థుల సౌకర్యార్థం ఏ పి యస్ ఆర్ టి సి విద్యార్థులకు బస్ పాసులు నేటినుండి (బుధవారం) నుండి జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ప్రజా రవాణా శాఖ ప్రధాన అధికారి ఎమ్ వై దానం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.విజయవాడ నగరము లో బస్ పాస్ పొందగోరు విద్యార్థులు పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నందు గల బస్ పాస్ కౌంటర్ల యందు పొందగలరు. మిగిలిన కౌంటర్ లలో (ఆటోనగర్ కంకిపాడు మరియు ఇబ్రహీంపట్నం) నందు బస్ పాస్ లురెన్యువల్ మాత్రమే చేయబడును. మరియు ఎన్టీఆర్ జిల్లా లో గల తిరువూరు, జగ్గయ్యపేట బస్ స్టేషన్ లలో నూతన బస్ పాస్ లు ఇవ్వబడును. బస్ పాస్ లు ఉదయం 9.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు ఇవ్వబడును. ఆదివారం మాత్రం8.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఇవ్వబడునని ఆయన వివరించారు.బస్ పాస్ అప్లికేషన్ల వెరిఫికేషన్ మాత్రం ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు చేస్తారనిఉచిత పాస్ లు 12 సంవత్సరము లోపు బాలురకు 7 వ తరగతి వరకు), 18 సంవత్సరముల లోపు బాలికలకు (10వ తరగతి వరకు) ఇస్తామని ఆయన తెలిపారు.రాయితీ బస్ పాసులకు సంబంధించి స్టూడెంట్ జనరల్ బస్ పాస్ (ఏడాది, త్రైమాసిక, మంత్లీ), రూట్ పాస్, గ్రేటర్ కృష్ణవేణిలు జారీ చేస్తామన్నారు.

**బస్ పాస్ పొందు విధానము:** మొదట దరఖాస్తు ఫారమును పూర్తి చేసి ఫోటో పైన మరియు బోనఫైడ్ సర్టిఫికెట్ నందు ప్రిన్సిపల్/హెడ్ మాస్టర్ తో సంతకము చేయించాలి.ఖాళీ దరఖాస్తు ఫారములను ఇంటర్నెట్ లో www.apsrtcpass.in నుండి డౌన్లోడ్ చేసుకొనవచ్చు. దరఖాస్తు ఫారమును ఆన్ లైన్ లో పూర్తి చేసి ఫోటో మీదమరియు బోనఫైడ్ సర్టిఫికెట్ నందు ప్రిన్సిపల్/హెడ్ మాస్టర్ తో సంతకము చేయించాలి. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్‌చేయించుకొన్నవారు బస్ పాస్ ను ప్రత్యేక కౌంటర్ లో పొందగలరు. విద్యా సంస్థ వారు పంపిన వివరములతో (అడ్మిషన్‌నెంబర్, తండ్రి పేరు. పుట్టిన తేదీ మొదలైనవి) దరఖాస్తు లోని వివరములు సరిపోలిన యెడల మాత్రమే బస్ పాస్ జారీచేస్తామన్నారు

**ముఖ్య గమనిక:** కళాశాల విద్యార్థులు దరఖాస్తు ఫారముతో పాటుగా 10 వ తరగతి మార్కుల జాబితా మరియుఆధార్ ల ఫోటో స్టాట్ తప్పని సరిగా జత పరచవలెను. అప్లికేషన్ పై ఫోన్ నంబర్ తప్పని సరిగా రాయాలి.కళాశాల యాజమాన్యాలు తమ వద్ద చదువుతున్న బస్ పాస్ పొందగోరు విద్యార్థుల జాబితాలను బస్ పాస్ సెక్షన్‌నందు అందజేయాలి. విద్యార్థుల జాబితాలు అందిన వారికి మాత్రమే కొత్త బస్ పాస్ లు జారీ చేయబడతాయి. కావునకళాశాల యాజమాన్యాలు ముందుగా విద్యార్థుల జాబితాలు అందజేయవలసినదిగా కోరడమైనదని ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎమ్ వై దానం పేర్కొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా 12 తేదీన స్థానిక పాఠశాలలకు శెలవు

**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు గన్నవరం మండలం, కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు విజయవాడ సిటీ, విజయవాడ రూరల్ పరిధిలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డ్ ప్రైవేటు విద్యా సంస్థలతో సహా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ సూచనలు పాటించాలని కోరారు. 2024-2025 విద్యా సంవత్సరానికి 12.06.2024కి బదులుగా అన్ని పాఠశాలలు 13.06.2024 నుండి పాఠశాలలను తిరిగి తెరవాలని పాఠశాల విద్యా శాఖ మెమో కూడా ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిగా ఎన్. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి గౌరవ ప్రధానమంత్రి, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖ వీఐపీలు హాజరుకానున్నారని వివరించారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి



**అనుమసముద్రంపేట జూన్ 11 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ఇంటి నిర్మాణం వద్ద శంఖవరపు అశోక్ ( 21) అనే యువకుడికివిద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ ఇంటి వద్ద సెంట్రింగ్ పనుల నిమిత్తం అశోక్ అనే యువకుడు పనిచేస్తూ ఉన్నాడు అయితే ఇనుప కమ్ములను మిద్ది పైకి తీసుకువెళ్లే సమయంలో ఇంటి పక్కనే ఉన్న 11 కెవి విద్యుత్తు వైర్లు తగలడంతో అక్కడకక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు వెంటనే 108 వాహనం ద్వారా సమీపంలోని హాస్పిటల్ కు తరలించారు అయితే అప్పటికే మృతి చెంది ఉన్నట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు పేర్కొన్నారు ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు ఈ మేరకు మృతుడు అశోక్ డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతూ అప్పుడప్పుడు కూలీ పనులు కు వెళుతూ కుటుంబానికి ఎంతో చేదోడు వాదోడుగా ఉండేవాడని తల్లిదండ్రులు రోదనాలతో విలపిలాడారు అలాగే తోటి స్నేహితులతో ఎంతో ఆప్యాయంగా ఉండేవాడని తెలిపారు ఈ మేరకు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## శాసనసభ పక్ష నేత చంద్రబాబుకి స్వాగతం పలికిన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)



**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్డీయే కూటమి శాసనసభా పక్ష సమావేశానికి హాజరైన టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) బోకే ఇచ్చి స్వాగతం పలికారు. మంగళవారం ఏ కన్వెన్షన్ హాల్ నందు ఎన్డీయే కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బిజెపి లకి చెందిన శాసనసభ్యుల సమావేశం జరిగింది. చంద్రబాబుకి స్వాగతం పలికిన అనంతరం కేశినేని శివనాథ్ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ను కూడా కలిసి కాసేపు మాట్లాడం జరిగింది. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబును శాసనసభ పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎంపికైనందుకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజలు గత ఐదేళ్లుగా విపత్కర పరిస్థితులు చూడటం జరిగింది. ఇలాంటి సమయంలో అనుభవం వున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగలరని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

## నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దివంగత గంగిశెట్టి బాబురావుకి ఘన నివాళులు..



**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత గంగిశెట్టి బాబురావు 2వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసిన నగర కాంగ్రెస్ కమిటీ ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు చిగురుపాటి బాబురావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి బాబురావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎపిసిసి ఉపాధ్యక్షులు వి.గురునాథం మాట్లాడుతూ గంగిశెట్టి బాబురావుతో పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కుటుంబ సంబంధం ఉండేదని బాబురావు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని వారి సేవలను కొనియాడారు..ఈ కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షులు ధనేకుల మురళి, కొలనుకొండ శివాజీ, సిపిఎం నగర కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్, గంగిశెట్టి బాబురావు కుమారులు ఉమామహేశ్వరరావు (అయ్యప్ప), శివరాము, ఎపిసిసి ప్రధాన కార్యదర్శిలు కాంగ్రెస్ కమిటీ కుటుంబ సభ్యులు నాయకులు మరియు బాబురావు అభిమానులు పాల్గొన్నారు.

## పందులు బాబోయ్ పందులు



**విస్సన్నపేట జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):**స్థానిక మండల కేంద్రంలో పందులు వీర విహారం చేస్తున్నాయి. వర్షాలు పడుతున్న సమయంలో పందుల వలన అంటు రోగాలు ప్రబలే పరిస్థితి ఉన్నదని పలువురు భయభ్రాంతులవుతున్నారు. గ్రామాలకు దూరంగా పందులు పెంపకం దారులు పెంచుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు. ప్రజా ఆరోగ్యాన్ని రక్షించవలసిన బాధ్యత కలిగిన అధికారులు ముందస్తు చర్యలలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన ఆదేశాలు జారీ చేయాలని ప్రజల నుండి డిమాండ్ వినిపిస్తుంది.

## ఏపీ ఈఏపి సెట్ ఫలితాలలో విస్సన్నపేట వికాస్ విజయ దుందుభి



**విసన్నపేట జూన్ 11 ,( వార్త ప్రభ ప్రతినిధి ):** స్థానిక వికాస్ ఇంజనీరింగ్ విభాగంలో వివిధ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను మరియు అధ్యాపక సిబ్బందిని వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి అభినందించారు.లంకె ఆకాష్ 3094 ,కడిమెళ్ళ గాయత్రి 9033,చెన్ను కళ్యాణి 9285,తోట సాయి శ్రీరామ్ 16 361,లేళ్ల లీలా మణికుమార్ 18980 ,చిన్నం నాగ తేజస్విని 19388,గోలి రేణుక 23184,మేశపాము జాషువా 26435,నల్లిబోయిన అజయ్ 29883 ,అన్నవరపు నాగదేవిక 33907,ర్యాంకులను కైవసం చేసుకోగా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో పల్లెపాం శామ్యూల్ ఎలిజా 26187,బెజవాడ రాజేశ్వరి 28113 ర్యాంకులను సాధించి అత్యుత్తమ ఫలితాలను సాధించారని మీడియా సమావేశంలో చెప్పారు.

## సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి బయలుదేరిన టిడిపి నాయకులు

**శింగనమల జూన్ 11 ,( వార్త ప్రభ ప్రతినిధి ):**టిడిపి అధినేత నారా చంద్రబాబు గన్నవరంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి మంగళవారం శింగనమల మండలం నుంచి టిడిపి నాయకులు వందలాదిగా తరలి వెళ్లారు. తమ నాయకుడు చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారాన్ని తమ కండ్లారా చూడాలని తామంతా తరలి వెలుతున్నట్లు టిడిపి నాయకులు తెలియజేశారు.

# ఉచితంగా మినరల్ వాటర్ పంపిణీ



**ఇబ్రహీంపట్నం జూన్ 11(వార్తా ప్రభ ప్రతినిధి):-** మండల పరిధిలోని కేతనకొండ గ్రామంలో గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని పేదలకు ఉచితముగా మినరల్ వాటర్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కువగా ఫ్లోరైడ్ నీటిని త్రాగడం వలన గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని, ఎముకలకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారని, మినరల్ వాటర్ కొనుక్కొని త్రాగలేని పరిస్థితుల్లో ఉన్నవారికి రోజుకు 1000 లీటర్ల చొప్పున కొన్ని రోజులు ఉచితంగా మినరల్ వాటర్ అందించడానికి గ్రేస్ మినిస్ట్రీస్ సేవలను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా, సెక్రటరీ సుమలత, సంఘస్తులు పాల్గొన్నారు.

# స్మశానం వద్ద బోరు షెడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన



**అనుమసముద్రంపేట జూన్ 11 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని హిందూ స్మశాన వద్ద బోరు షెడ్డు ఏర్పాటు కోసం అధికారులు స్థల పరిశీలన చేశారు హిందూ స్మశానం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో బోరు షెడ్డు ఏర్పాటు చేయడంతో పాటు దారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడం జంగిల్ క్లియరెన్స్ చేయడం జరుగుతుందని తెలిపారు ఎంపీపీ ఎంపీడీవో ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ యస్దాని ఉపాధి హామీ ఏపీఓ సునీల్ ఉపాధి హామీ ఈసీ నవీన్ పాల్గొన్నారు.

# బాలయ్య భారీ గిఫ్ట్ అందుకుంటారా ?



**అమరావతి జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )**నందమూరి వారసుడు బాలయ్యకు ఈసారి మంత్రి పదవి దక్కుతుందా అంటే అవకాశాలు చాలానే ఉన్నాయని చర్చ సాగుతోంది. బాలయ్య హిందూపురం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన 2014లో మొదలెట్టి 2024 లో తన మెజారిటీని అంతకంతకు పెంచుకుంటూ పోయారు. 2019లో జగన్ వేవ్ లో సైతం 17 వేల ఓట్ల తో గెలిచి తన సత్తా చాటారు. హిందూపురాన్ని నందమూరిపురంగా మార్చడంతో బాలయ్య పూర్తిగా సక్సెస్ అయ్యారు. బాలయ్య పోటీ చేస్తే విజయం ఖాయం అన్న అభిప్రాయాన్ని తీసుకుని వచ్చారు. తనకు కంచుకోటగా మార్చుకున్నారు. ఈసారి కూడా 36 వేలకు తక్కువ కాకుండా భారీ మెజారిటీతో గెలిచిన బాలయ్యకు మంత్రి పదవి ఖాయం అని ఆయన అభిమానులు అంటున్నారు. బాలయ్యను మంత్రిగా చూడాలని 2014 నుంచి కళ్ళు కాయలు కాచేలా ఆయన ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అప్పట్లో తొలిసారి బాలయ్య గెలవగానే ఆయన మినిస్టర్ అని విపరీతంగా ప్రచారం చేశారు. కానీ ఆయనకు దక్కలేదు. ఇక 2019లో కచ్చితంగా మంత్రి అవుతారు అనుకుంటే టీడీపీ విపక్షంలోకి వెళ్ళిపోయింది. ఇపుడు టీడీపీ పవర్ చేజిక్కుకోవడంతో బాలయ్యకు ఇచ్చి తీరాల్సిందే అన్నది అభిమానుల మాటగా ఉంది. ఈ విషయంలో చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నారు అని అంటున్నారు. బాలయ్య పుట్టిన రోజు వేళ గ్రీట్ చేస్తూ తనకు అత్యంత ఆత్మీయుడు అని బావమరిది మీద తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈసారి ఉమ్మడి అనంతపురం జిల్లా కోటా నుంచి తీవ్రమైన పోటీ ఉంది. పరిటాల సునీత పయ్యావుల కేశవ్ వంటి వారు రేసులో ఉన్నారు. అలాగే ధర్మవరం నుంచి గెలిచిన బీజేపీ నేత సత్యకుమార్ కూడా మంత్రి పదవి కోసం పరిశీలనలో ఉన్నారు. అయితే రాజకీయ సామాజిక లెక్కలు ఎలా ఉన్నా బాలయ్య విషయంలో మినహాయింపు ఇచ్చి మరీ మంత్రిని చేస్తారా అన్నదే చర్చగా ఉంది. మరో వైపు చూస్తే బాలయ్యకు మంత్రి పదవి అని అది సినిమాటోగ్రఫీ శాఖ అని కూడా ప్రచారం సాగుతోంది. ఈ శాఖ కనుక ఇస్తే బాలయ్య తన అనుభవంతో సినీ పరిశ్రమకు అటు ఏపీ ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటారని అంటున్నారు. మొత్తం మీద చూస్తే బాలయ్య మినిస్టర్ అన్నది ఈసారి నెరవేరుతుందా అంటే ఫ్యాన్స్ మాత్రం అవును అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# చెత్త సేకరణలో ఎలాంటి అలసత్వం వహించరాదు

**కోరుట్ల జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )::** పట్టణంలోని వివిధ వార్డులో చెత్త సేకరణలో ఎలాంటి అలసత్వం వహించరాదని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆటో డ్రైవర్లకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మున్సిపాలిటీలో విధులునిర్వహించే ఆటో డ్రైవర్లులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ..

# తప్పు చేసినవారిని వదిలిపెట్టబోను - చంద్రబాబు



■ తప్పు చేసినవాడిని క్షమించి వదిలిపెడితే అది అలవాటుగా మారుతుందన్న చంద్రబాబు ■ తప్పు చేసినవాళ్లకు చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది ■ విధ్వంస, కక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని హితవు

**విజయవాడ, జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):**తప్పు చేసినవారిని వదిలిపెట్టబోనని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. "తప్పు చేసినవాడిని క్షమించి, పూర్తిగా వదిలిపెడితే అది అలవాటుగా మారుతుంది. తప్పు చేసినవాళ్లకు చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో విధ్వంస, కక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలి. పదవి వచ్చిందని విర్రవీగొద్దు. వినయంగా ఉండాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇంకా చంద్రబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తాను బుధవారం నాలుగోసారి ప్రమాణం చేయబోతున్నానని.. రేపటి ప్రమాణానికి ఉన్న ప్రాధాన్యత వేరని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో మనపై బాధ్యత పెరిగిందన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు పవన్ కల్యాణ్ వచ్చి పరామర్శించడమే కాకుండా, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని చెప్పారని బాబు గుర్తు చేశారు. జనసేన, బీజేపీతో పొత్తు కలిసొచ్చిందన్నారు. ఇక పవన్, తాను కలిసి జిల్లా పర్యటన చేశామన్నారు. అటు బీజేపీ అగ్రనేతలు కూడా రాష్ట్రంలో పర్యటించారని, విజయవాడలో కూటమి రోడ్ షోను మోదీ అభినందించారని గుర్తుచేశారు. తాను ఎప్పుడూ రాగద్వేషాలకు అతీతంగా పనిచేశానని పేర్కొన్నారు. తనకు ప్రజాహితమే తెలుసన్నారు.

# జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 13న ఇంటర్వ్యూ

## - జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత

**మంచిర్యాల జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):** జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ పరిధిలోని ఎన్.హెచ్.ఎం. సిబ్బంది ఒప్పంద పొరుగు సేవల పద్ధతిన పోస్టుల సంబంధిత మెరిట్, ఎంపిక జాబితాను డి.డి.ఎం., రిఫ్రిజిరేటర్ మెకానిక్, సీనియర్ డాట్స్ ప్లస్ టి.బి. హెచ్.ఐ.వి. ఎస్.టి.ఎల్.ఎస్., సహాయ సిబ్బంది, జిల్లా అకౌంట్ అధికారి, జిల్లా ప్రోగ్రామ్ సమన్వయకర్త జిల్లా వైద్య అధికారి కార్యాలయంతో పాటు మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్సైట్లో ఉంచడం జరిగిందని, ఎంపిక అయిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ ఉదయం 10.30 గం॥లకు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? అనిత ఒక ప్రకటనలో తెలిపారు.

# చీరాల ఎమ్మెల్యే కొండయ్య కు బిజెపి నేతల శుభాకాంక్షలు



**ఇబ్రహీంపట్నం జూన్ 11(వార్తా ప్రభ ప్రతినిధి):-** కేతనకొండ గ్రామంలోని ఆర్కే కాలేజీ అధినేత యం యం కొండయ్య చీరాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేసి కనీసం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం నాడు బిజెపి పార్టీ గ్రామ అధ్యక్షులు పయ్యావుల రాము జనసేన అధ్యక్షులు కొమ్మూరు వెంకటస్వామి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు. కొమ్మూరి గోపి లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా పుష్పగుచ్ఛంతో ఆయనను సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమీ కలయికతో ప్రజల్లో చైతన్యం ఏర్పడి కూటమికి ఘనవిజయం చేకూర్చారని అన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన కొండయ్య ఎమ్మెల్యేగా గెలుపొందడం అందరికీ ఆనందకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ లేపాక్షిరావు,పులి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను శుభ్రం చేయించండి -ఎంపీపీ



**ఇబ్రహీంపట్నం, జూన్ 11 (వార్తా ప్రభ ప్రతినిధి ):-** ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో తక్షణమే పరిశుభ్రం చేయించి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలను, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదివేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో పి.ఉమాదేవి, ఎంఈవో - 1 సిహెచ్.పుష్పలత, ఎంఈవో - 2 శ్యామ్ బాబు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం ప్రత్యక్ష ప్రసారం

■ ప్రత్యక్ష ప్రసారం కోసం నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్లు ఏర్పాటు

■ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు వెల్లడి

**విజయవాడ పశ్చిమ జూన్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి )** ఈనెల 12వ తేదీన (నేడు) రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వీలుగా నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రసారం చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్నవరం సమీపంలోని కేసరిపల్లి ఐటి పార్క్ వద్ద నిర్వహించనున్న చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యేక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్ ) కోసం నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం , స్వరాజ్ మైదానం అంబేద్కర్ స్మృతి వనం , పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ , లెనిన్ సెంటర్, పటమట జడ్పి హై స్కూల్ రైతు బజార్, సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింఖానా గ్రౌండ్, విద్యాధర పురం స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణ రైస్ మిల్, సూర్య గోడౌన్, ఎస్ ఆర్ కె ఇంజనీరింగ్ కాలేజ్, అను మై బేబీ హాస్పిటల్ ప్రాంతాలలోను, నిడమానూరు బ్లూ బజ్ గ్రౌండ్స్, కెకెఆర్ గౌతమ్ స్కూల్, సవారిగూడెం - కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కృష్ణలంక రాణిగారి తోట మైదానంలలో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఆయా ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్ల ద్వారా ప్రసారం చేసే ప్రత్యక్ష ప్రసార సౌకర్యాన్ని వినియోగించుకొని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు.

# ఎక్కడ తగ్గాలో.. తెలిసిన నాయకుడు చంద్రబాబు.. ఇదీ ఎగ్జాంపుల్!

**అమరావతి జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )**ఎంత ఎత్తుకు ఎదిగామన్నది కాదు.. ఎంత ఎత్తుకు ఎదిగినా.. ఎంత ఒదిగి ఉన్నామన్నది ముఖ్యం. ఈ విషయంలో గత ముఖ్య మంత్రి జగన్ విఫలమయ్యారనే వాదన రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ఆరుద్ర అనే మహిళ జగన్ను కలిసేందుకు తాడేపల్లికి వస్తే.. కనీసం అప్పాయింట్ మెంట్ దక్కక పోగా వైసీపీ నేతల నుంచి బెదిరింపులు వచ్చిన సంఘటన తెలిసే ఉంటుంది. దీంతో ఆమె ఏకంగా రాష్ట్రం విడిచి మరీ పారిపోయారు. తాజాగా వారణాసి నుంచి తాను మళ్లీఏపీకి వస్తున్నట్టు చెప్పిన విషయం కూడా తెలిసిందే. ఇది నాటి పరిపాలన ఎలా ఉందో చెప్పడానికి మచ్చుతునక. కానీ, చంద్రబాబు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకుండానే.. ఎలా ఒదిగి ఉండాలో.. ఎక్కడ తగ్గాలో నిరూపిస్తున్నారు. చంద్రబాబు ను చూడాలి అంటూ కాన్వాయ్ వెంట మహిళ పరుగులు పెట్టడాన్ని గమనించిన బాబు.. తన కారును ఆపి మాట్లాడిన చంద్రబాబు ఆమెను ఉత్సాహ పరిచారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఏం జరిగిందంటే.. ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయుడుని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు దారి పొడవునా స్వాగతం పలికారువిజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్లో జరిగిన కూటమి సమావేశం అనంతరం ఉండవల్లి ప్రయాణమైన చంద్రబాబును చూసేందుకు మదనపల్లికి చెందిన ఓ మహిళ కాన్వాయ్ వెంట పరుగులు పెట్టింది. ఆ మహిళను కారు లోంచి చూసిన చంద్రబాబు వెంటనే కాన్వాయ్ ను ఆపి.. ఆ మహిళను దగ్గరకు పిలిచి మాట్లాడారు. తనది మదనపల్లి అని తన పేరు నందిని అని చెప్పిన ఆ మహిళ చంద్రబాబుపై అభిమానంతో చూడడానికి వచ్చాను అని చెప్పింది. తనను చూసి ఎమోషన్ అయిన ఆ మహిళతో చంద్రబాబు మాట్లాడారు. సెక్యూరిటీని వారించి మరీ చంద్రబాబు సదరు మహిళ వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో ఆమె మాట్లాడుతూ.. మా కష్టం ఫలించి....మా కోరిక మేరకు మీరు సిఎం అయ్యారు సార్....ఒక్క సారి మీ కాళ్లు మొక్కుతాను అంటూ ఆ మహిళ వేడుకుంది. అయితే... చంద్రబాబు ఆమె అభ్యర్థనను సున్నితంగా వారించారు. ఆమెను ఆప్యాయంగా పలకరించి ఆమెతో ఫోటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడాలని వచ్చాను అని నందిని చెప్పగా.. ముందు ఆసుపత్రికి వెళ్లమ్మాఅని చంద్రబాబు సూచించారు. అంతేకాదు ఆమె ఎక్కడ ఉంటారో తెలుసుకుని వైద్య సేవలు అందించాలని పార్టీ ముఖ్య నేతలకు చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. చిత్రం ఏంటంటే.. ఇప్పుడు చంద్రబాబు క్షణం కూడా తీరిక లేకుండా ఉన్నారు. ఇలాంటి సమయంలోనూ తనను చూసేందుకు వచ్చిన మహిళను ఆప్యాయంగా పలకరించి.. ఆమెను సంతోషం కలిగించడమే!!



# లోక్ సభ స్పీకర్ పదవి అంత వీజీ కాదు



**న్యూఢిల్లీ** 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మిత్రపక్షాల మీద ఆధార పడిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా టీడీపీ, జేడీయూలపై ఎన్డీఏ ప్రభుత్వం ఎక్కువగా ఆధారపడింది. ఈ క్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ లు మోడీ సర్కార్ ను నిలబెట్టడంలో కీలకంగా మారారు. మరీ ముఖ్యంగా 12 మంది ఎంపీలున్న నితీశ్ కుమార్ తో పోలిస్తే 16 మంది టీడీపీ ఎంపీలున్న చంద్రబాబు మోడీకి ఎంతో కీలకంగా మారారు. ఈ క్రమంలోనే ఈ ఇద్దరు నేతలు లోక్ సభ స్పీకర్ పదవి తమకు కావాలని మోడీని కోరారని జాతీయ మీడియాలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. అయితే, ఈ ఇద్దరూ స్పీకర్ పదవిపై ఎందుకింత పట్టుపడుతున్నారు అన్న విషయంపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. అయితే, సంకీర్ణ ప్రభుత్వంలో స్పీకర్ పదవికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. పొరపాటున మిత్రపక్షాలతో తేడాలొస్తే స్పీకర్ చేతిలో చక్రం ఉంటుంది. దాంతోపాటు, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేసే అధికారం కూడా స్పీకర్ కు ఉంటుంది. అందుకే, తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ ఇద్దరు సీనియర్ పొలిటిషన్లు ముందు జాగ్రత్తగా స్పీకర్ పదవి కోరుతున్నారని తెలుస్తోంది. మహారాష్ట్ర, బీహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆ రాష్ట్రాలలో రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయో చెప్పడం కష్టం. కాబట్టి, ఈ లోపే స్పీకర్ పదవి కోసం చంద్రబాబు, నితీశ్ పట్టుబడుతున్నారట. కానీ, బీజేపీకి పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో స్పీకర్ పదవిని మిత్రపక్షాలకు ఇచ్చే సమస్యే లేదని బీజేపీ భావిస్తోందట. 2014లో సుమిత్రా మహాజన్, 2019లో ఓం బిర్లా స్పీకర్లుగా ఎన్నికైనా..బీజేపీకి స్పష్టమైన మెజారిటీ ఉండడంతో ఇబ్బంది లేదు. అయితే, డిప్యూటీ స్పీకర్ పదవిని పురందేశ్వరికి ఇస్తామన్న ప్రతిపాదనను మోడీ పెట్టినట్లు తెలుస్తోంది. అయితే, చంద్రబాబు మాత్రం స్పీకర్ పదవి కావాలని పట్టుబడుతున్నారని తెలుస్తోంది. వాస్తవానికి స్పీకర్ పదవి పార్టీలకు అతీతంగా ఉండేది. ఆ కుర్చీలో కూర్చునే వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. కానీ, గత రెండు దశాబ్దాలుగా స్పీకర్ లు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఏది ఏమైనా స్పీకర్ కుర్చీ కోసం పొలిటికల్ మ్యూజికల్ ఛెయిర్స్ ఆట ఆడుతున్న టీడీపీ, బీజేపీ, జేడీయూలలో ఏది గెలుస్తుంది అన్నది తేలాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# రేవంత్ కి నో అన్న బాబు... షాకింగే మరి !



**అమరావతి జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )**నిజానికి బాబు ఈసారి ఎన్నికల్లో గెలిచాక ఫోన్ లో రేవంత్ రెడ్డి అభినందించారు. అంతే కాదు బాబు పిలిస్తే తప్పకుండా తాను ప్రమాణ స్వీకారానికి హాజరవుతాను అని కూడా చెప్పారు. ఇంతటి కీలక కార్యక్రమంలో రేవంత్ రెడ్డి తప్పకుండా ఉంటారు అని అంతా అనుకున్నారు. కానీ బిగ్ ట్విస్ట్ ఏంటి అంటే రేవంత్ రెడ్డికి బాబు ఆహ్వానించడం లేదు అని. దానికి కారణాలు ఆరా తీస్తే బాబుకు రేవంత్ మీద కోపం ఏమీ లేదు. రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే అలా జరిగింది అని అంటున్నారు. బాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒక వైపు ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతున్నారు. మరో వైపు చూస్తే అమిత్ షా వస్తున్నారు. ఇలా బీజేపీ దిగ్గజ నేతలు ఇద్దరూ వస్తున్న ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావించే ఇలా చేశారు అని అంటున్నారు. ఒక వైపు బీజేపీకి సొంతంగా మెజారిటీ రాక బాబు మీద ఆధారపడింది. ఇంకో వైపు ఇండియా కూటమి కూడా అధికారం కోసం కాచుకుని కూర్చుంది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ సీఎం ని పిలిస్తే బాబు మీద కూడా మోడీ షాలకు అనుమానాలు వస్తాయి. ఏపీకి కేంద్రంలో బీజేపీ సాయం చాలా అవసరం. ఇపుడు రేవంత్ రెడ్డి రూపంలో వీటికి ఇబ్బందులు తెచ్చుకోవడం అవసరమా అన్న చర్చ సాగిన మీదటనే ఆయనకు నో చెప్పేశారు అని అంటున్నారు. మోడీ తెలంగాణాలో అధికారంలోకి ఎలాగైనా రావాలని చూస్తున్నారు. అదే విధంగా చూస్తే ఇండియా కూటమి పైనా కాంగ్రెస్ పైనా బీజేపీ ఎప్పటికపుడు నిప్పులు చెరుగుతూ ఉంటుంది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులను ఎన్డీయే ప్రభుత్వ ప్రమాణ స్వీకారానికి పిలవడం భావ్యం కాదనే బాబు ఇలా చేశారు అని అంటున్నారు. మరో వైపు బాబు నాయకత్వంలో రెండు రాష్ట్రాల మధ్య మంచి సంబంధాలు ఉండాలని విభజన చట్టంలోని అంశాలను అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. అయితే ప్రమాణ స్వీకారానికి కాకపోయినా ఆ తరువాత అయినా ఇద్దరు ముఖ్యమంత్రులు రాష్ట్రాల సమస్యలను పరిష్కరించుకోవడానికి సమావేశం అయ్యే వీలు ఉందని అంటున్నారు.

# కమలం వైపు ... బాలినేని చూపు



**ఒంగోలు,జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):** ఒంగోలులో ఘోర పరాజయం చవి చూసిన మాజీ మంత్రి బాలినేని పొలిటికల్ ఫ్యూచర్‌పై లెక్కలు వేసుకుంటున్నారంట. కొడుకుతో కలిసి జనసేనలోకి వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నారంట. మూడో కంటికి తెలియకుండా ఆ దిశగా అంతర్గత చర్చలు జరుగుతున్నాయంట. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని మొదట్లోనే వ్యతిరేకించిన బాలినేని. జగన్ ఆదేశాలతో తర్వాత సైలెంట్ అవ్వాల్సి వచ్చింది. ఇప్పుడా కోపంతోనే ఆయన పార్టీ మారే ఆలోచనలో పడ్డారంట.బాలినేని శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బలమైన నేత. ఒంగోలు నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. మెన్నటి కూటమి గాలిలో టీడీపీ అభ్యర్థి దామచర్ల జనర్ధన్ చేతిలో మూప్పై వేల ఓట్ల తేడాలో ఘోర ఓటమిని చవిచూసారు. ఎన్నికల ముందు గ్రౌండ్ వర్క్ ఎంత చేసుకున్నా.. ఓట్లు పడక పొవడంతో పొలిటికల్ ఫ్యూచర్‌పై బాలినేని ఆలోచనలో పడ్డారంట.ఎన్నికల టైంలో టీడీపీ కన్నా ఎక్కువ నగదు, బియ్యం బస్తాలు, మటన్ , చికెన్‌లు పంచారు వైసీపీ నేతలు.. వాటిని జనం బానే తీసుకున్నారు. దాంతో కనీసం వైసిపి అభ్యర్థిగా ఉన్న బాలినేని ఐదు వేల ఓట్లతో అయినా బయట పడతానని కాన్ఫిడేంట్‌గా కనిపించారు. అయితే సీన్ రివర్స్ అయింది. వైసీపీకి పక్కగా పడుతాయన్న ఓట్లే పోల్ కాలేదని అర్థమవ్వడంతో.. బాలినేని కౌంటింగ్ రోజు మూడో రౌండ్‌కే కౌంటింగ్ హల్ నుంచి వెళ్ళిపొయారు. ఇంత దారుణంగా ఓడిపోతానని ఊహించలేదని బాలినేని సన్నిహితుల వద్ద వాపోతున్నారంట.ఒంగోలులో 20 వేల ఇళ్ళపట్టాలు పంపిణీ చేయించిన బాలినేనికి ఓటమి పెద్ద షాకే ఇచ్చింది. బాలినేని ఫాలోయర్‌గా ఉన్న ఒంగోలు మేయర్ గంగడ సుజత టీడీపీ లోకి వెళ్లడం ఖాయమైంది. ఇప్పటికే ఆమె టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల టీంతో టచ్ లో ఉన్నారంట. ఒంగోలు కార్పొరేషన్ లో మొత్తం 50 డివిజన్ లలో 43 స్థానాలు వైసీపీ గెలుచుకోగా ఒక స్థానం జనసేన మిగిలిన స్థానాలను టీడీపీ గెలిచింది. రాష్ట్రంలో అధికారం మారటంతో కార్పొరేటర్లు టీడీపీ వైపు చూస్తున్నారు. దాంతో ఒంగోలు నగరపాలక సంస్థ రాజకీయ ముఖ చిత్రం మారిపోనుంది. ఇదంతా బాలినేని మాస్టర్ ప్లాన్ అన్న టాక్ నడుస్తుంది.ఏపీలో అక్కడక్కడా జరుగుతున్న గొడవలపై బాలినేని ఎక్స్ వేదికగా స్పందించిన తీరుతో అసలు సిసలైన అనుమానం జనాల్లో మొదలైంది. 'అఖండ విజయం సాధించిన పవన్ కల్యాణ్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. హింసాత్మాక ఘటనలకు తావులేదని నిన్నటి రోజున మీరిచ్చిన సందేశం హర్షణీయం.. శాసనసభ్యునిగా నా 25ఏళ్ల రాజీకియ జీవితంలో ఎటువంటి హింసాత్మాక ఘటనలకు తావులేదు. అయితే మీ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఒంగోలు చరిత్రలో ఎన్నడూలేని విధంగా చోటు చేసుకుంటున్న హింసాత్మాక ఘటనలు, అక్రమ కేసులు , భౌతిక దాడులపై మీరు స్పందించాలని కోరుకుంటున్నాను.. ధన్యవాదాలు' అని బాలినేని ట్వీట్ చేశారు.ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు ఉండగా.. పవన్ పేరే ప్రస్తావించే ఎందుకు ట్వీట్ చేశారన్నది ఇప్పుడు వైసీపీ, జనసేన అభిమానుల్లో చర్చగా మారింది. వాస్తవానికి పవన్-బాలినేని మధ్య కొత్త పరిచయమేమీ అక్కర్లేదు. ఇద్దరి మధ్య సత్సంబంధాలున్నాయి. ఇక సినీ ఇండస్ట్రీ పరంగా కూడా బాలినేనికి చాలా మంది నిర్మాతలతో వ్యాపార సంబంధాలు కూడా ఉన్నాయి. ఆ మధ్య పవన్ కల్యాణ్ సినిమాకు బాలినేని కోట్లలో డబ్బులు కూడా ఇన్వెస్ట్ చేశారు.ఆ క్రమంలో జనసేనలోకి వెళితే తన వారసుడు ప్రణీత్ రెడ్డికి పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందని.. తనకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిచయాలతో మళ్లీ మునుపటి రోజులు తెచ్చుకోవచ్చని బాలినేని భావిస్తున్నారట. అందుకే వైసీపీని వీడి.. పవన్ సమక్షంలో జనసేనలో చేరడానికి మంత్రాంగం మొదలుపెట్టారంట. ఒంగోలుతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బాలినేని తన అనుచరులను కాపాడుకోవాలంటే జనసేనలోకి వెళ్ళటం మంచిదని ఫిక్స్ అయ్యారంట. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రిప్లై కోసం ఎదురు చూస్తున్నారట. పవన్ సానుకులంగా స్పందిస్తే జనసేనలోకి బాలినేని సిద్దంగా ఉన్నట్లు తెలుస్తుంది.గతంలో పవన్ కల్యాణ్ చేనేత వస్త్రాలు ధరించాలని బాలినేనికి ట్విట్టర్ ఛాలెంజ్ చేసినప్పుడు.. బాలినేని చేనత వస్త్రాలు ధరించి ఛాలెంజ్ తీసుకున్నారు. అప్పుడు వైసీపీలో బాలినేని వ్యవహారంపై పెద్ద రచ్చ నడిచింది. వైసీపీలో తనకు జగన్ వల్ల చాలా అవమానాలు ఎదరయ్యాయని బాలినేని తనవారి దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారంట. జగన్ ఓన్లీ ఐప్యాక్ టీం మీద ఆధారపడి.. సీనియర్ల సలహాలు తీసుకోలేదని.. సజ్జల వంటి ఒకరిద్దరు నేతలు, అధికారులను నమ్ముకుని పార్టీని నాశనం చేశారని అంటున్నారంట.ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు దగ్గర బంధువైన బాలినేని పార్టీ మారితే ప్రకాశం జిల్లాలో వైసీపీకి కోలుకోలేని స్ట్రోక్ తగిలినట్లే. బాలినేని వైసీపీని వీడతారన్న వార్తలను ఇంతవరకూ బాలినేని గానీ.. ఆయన కుటుంబ సభ్యులు కానీ ఖండించడం లేదు. కనీసం సోషల్ మీడియా వేదికగా కూడా రియాక్ట్ కాకపోవడంతో ఆ ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. మరి బాలినేనికి ముహూర్తబలం ఎప్పటికి కుదురుతుందో చూడాలి.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆపధర్మ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో తాడేపల్లిలోని వారి నివాసంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షాహిమ్ అలీబేగ్ మరియు బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్ లు కలిసిన చిత్రం. **– వార్తా ప్రభ, మార్కాపురం**

# గల్లా జయదేవ్ రీ ఎంట్రీ...



**గుంటూరు, జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):** తెలుగు రాజకీయాల్లో చెరగని ముద్ర గల్లా ఫ్యామిలీది. పాటూరు రాజగోపాల్ నాయుడు నుంచి గల్లా జయదేవ్ వరకు ఆ కుటుంబం రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగింది. మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు నుంచి రాజకీయ వారసత్వాన్ని అందుకున్న ఆయన కూతురు గల్లా అరుణ కుమారి ఆ తరువాత ఆమె కొడుకు జయదేవ్ తెలుగు రాజకీయాల్లో తమదైన మార్క్ చూపించారు. గల్లా జయదేవ్ గుంటూరు ఎంపీగా 2 సార్లు గెలిచి నేషనల్ లెవల్లో ఫోకస్ అయ్యారు.. అలాంటి ఫ్యామిలీ ఈ సారి ఎన్నికల్లో పోటీకి దూరమైంది. వైసీపీ సర్కారు వేధింపుల పుణ్యమా అని.. తమని నమ్ముకుని ఉన్న వేల కుటుంబాల శ్రేయస్సు కోసం పొలిటికల్ బ్రేక్ తీసుకుంది.అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట గల్లా ఫ్యామిలీ రాజకీయ భవితవ్యం. దాదాపు 70 ఏళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ పోటీపడే ఆ కుటుంబం తొలిసారిగా పోటీ నుంచి తప్పుకుంది. వేల కోట్ల ఆస్తులు.. వేల మంది ఉద్యోగులు.. లక్షల మంది అభిమానులు అండదండలు ఉన్నా.. వ్యాపారం కోసం తమపై ఆధారపడిన ఉద్యోగుల కుటుంబాల కోసం గల్లా కుటుంబం రాజకీయాలను తప్పుకోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా జరుగుతూనే ఉంది.రాజకీయాలకు ఇక సెలవు అంటూ గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ చేసిన ప్రకటన.. టీడీపీ కార్యకర్తలను గల్లా అభిమానులను నివ్వెరపరిచింది. 1955 నుంచి రాజకీయాల్లో ఉన్న జయదేవ్ కుటుంబం తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల సమరం నుంచి తప్పుకోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌గా మారింది. 2019 ఎన్నికల నుంచే జయదేవ్ తల్లి మాజీమంత్రి గల్లా అరుణకుమారి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ఇప్పుడు జయదేవ్ కూడా తప్పుకోవడంతో 70 ఏళ్లలో తొలిసారిగా గల్లా కుటుంబం ఎన్నికల రణక్షేత్రం నుంచి నిష్క్రమించినట్లైంది.జయదేవ్ తాత గల్లా అరుణ తండ్రి పాటూరి రాజగోపాల్‌నాయుడు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. 1955లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పాటూరు రాజగోపాల్‌నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలను శాసించారు. చిత్తూరు జిల్లాలోని తవణంపల్లె నియోజకవర్గం నుంచి 1955లో కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా, 1962లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. పాటూరు రాజగోపాల్ నాయుడు. 1972లో శాసన మండలి సభ్యుడుగా పనిచేశారు. తర్వాత చిత్తూరు ఎంపీగా రెండు సార్లు విజయం సాధించారు.జిల్లాలో అనేక సామాజిక కార్యక్రమాలతో జనం లో నిలిచిన రాజగోపాల్ నాయుడుని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కూడా తన రాజకీయ గురువుగా చెప్పుకుంటారు.ఆయన తర్వాత రాజగోపాల్‌నాయుడు కుమార్తె గల్లా అరుణ కుమారి కూడా అదే ఒరవడి కొనసాగించారు. ఆ కుటుంబ రాజకీయ చరిత్రలో ఎక్కువ విజయాలే కనిపిస్తాయి. రాజగోపాలనాయుడు వారసురాలిగా వచ్చిన గల్లా అరుణకుమారి 80వ దశకం నుంచి దాదాపు నలభయ్యేళ్లు రాజకీయాల్లో కొనసాగారు. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమె మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లో ఎక్కడా కనిపించలేదు.ఆమె కుమారుడు గల్లా జయదేవ్ 2014లో రాజకీయాల్లో అడుగుపెట్టి వరుసగా రెండుసార్లు గుంటూరు ఎంపీగా గెలిచి ప్రత్యేకత చాటుకున్నారు. అరుణకుమారి కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేసి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. అమరరాజా ఫ్యాక్టరీస్‌తో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన గల్లా కుటుంబంపై ఈ ప్రాంతంలో ఎంతో గౌరవం ఉంది. అందుకే ఆ కుటుంబ రాజకీయ చరిత్రలో ఎక్కువ విజయాలే కనిపిస్తాయి.రెండుసార్లు ఎంపిగా గెలిచిన జయదేవ్.. చాలాకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు. ఎంపీగా గెలిచిన తొలిసారే మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అంటూ తన వాగ్దాటిని ప్రదర్శించిన జయదేవ్ నేషనల్ వైడ్‌గా ఫోకస్ అయ్యారు. అలాంటాయన అనూహ్యంగా రాజకీయాల నుంచి నిష్క్రమిస్తూ తీసుకున్న నిర్ణయం టీడీపీ వర్గాలను నివ్వెరపరిచింది. ఆయన ఆకస్మికంగా పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పడానికి గల కారణాలపై విస్తృత చర్చ జరిగింది రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక గల్లా కుటుంబానికి చెందిన అమర రాజా సంస్థ అనేక ఇబ్బందులు పడుతుంది.గల్లా జయదేవ్ నిర్ణయం ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గల్లా నిర్ణయంపై మరింత ఎక్కువ చర్చ జరుగుతోంది. జయదేవ్ ఈ సారి బరిలో ఉండి ఉంటే గుంటూరు ఎంపీగా హ్యాట్రిక్ విజయం సాధించి కేంద్రంలో కేబినెట్ బెర్త్ దక్కించుకునే వారనడంలో ఎలాంటి సందేహం.. మొత్తమ్మీద జగన్ కక్షపూరిత రాజకీయాల పుణ్యమా అని ఏపీ ఒక మంచి లీడర్‌ని కోల్పోయింది.

# సీనియర్లకు హామీలతో సరా

**కాకినాడ, జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )::** కేంద్ర మంత్రివర్గంలో ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీ ఎంపీలు కాకుండా బీజేపీ తరపున ఎన్నికైన భూతపతిరాజు శ్రీనివాస వర్మకు చోటు దక్కడం సంచలనంగా మారింది. ఏపీ నుంచి బీజేపీ తరపున ముగ్గురు ఎంపీలు గెలిచారు. ఖచ్చితంగా కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభిస్తుంది. ప్రాధాన్యతల క్రమంలో చూసుకుంటే మొదటి పేరు పురందేశ్వరి? తర్వాత సీఎం రమేష్.. ఆ తర్వాత శ్రీనివాసవర్మ ఉంటారు. కానీ బీజేపీ హైకమాండ్ మాత్రం శ్రీనివాసవర్మకే కేంద్ర మంత్రి పదవి ప్రకటించింది. ఆయన సహాయ మంత్రిగా పదవీ ప్రమాణం చేశారు. ఆయనకు కేంద్ర పెద్దలు ప్రాధాన్యమివ్వడం వెనుక కీలక సందేశం ఉందని అంచనా వేస్తున్నారు.బీజేపీలో కింది స్థాయి నుంచి పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని వారిని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటామన్న సందేశాన్ని శ్రీనివాసవర్మకు కేంద్ర మంత్రి పదవి కేటాయించడం ద్వారా హైకమాండ్ పంపిందని అంటున్నారు. ఏపీలో పొత్తుల్లో టిక్కెట్ల కేటాయింపు తర్వాతా అన్నీ ఒక్క గ్రూపుకే ప్రాధాన్యం లభించిందన్న ఆరోపణలు వచ్చాయి. మొదటి నుంచి పార్టీలోనే ఉన్న సీనియర్లను పక్కన పెట్టారని .. వారికి ఒక్క చోట కూడా పోటీ చేసే అవకాశం ఇవ్వలేదన్న విమర్శలు వచ్చాయి. సీనియర్ నేతలు కొంత మంది ఈ అంశంపై హైకమాండ్‌కు కూడా లేఖ రాశారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ కోసం పని చేసే వారిలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందన్న ఆందోళన కూడా కనిపించింది. అయితే పొత్తులు, ఇతర కారణాల వల్ల బీజేపీ హైకమాండ్ టిక్కెట్ల కేటాయింపులో న్యాయం చేయలేకపోయింది. అప్పటికీ నర్సాపురం సీటు కోసం రఘురామకృష్ణరాజు కోసం ఇతర పార్టీలు తీవ్రంగా ఒత్తిడి చేసిన వెనక్కి తగ్గలేదు. మొదటి నుంచి పార్టీలోనే ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మకే కేటాయించారు. మార్పు చేయాలని వచ్చిన ఒత్తిళ్లను అంగీకరించలేదు. ఆయననూ మారిస్తే ఇక పేరుకే బీజేపీ పోటీ అని.. కిందిస్థాయి నుంచి బీజేపీలో పని చేస్తూ వచ్చిన వారు ఎవరికీ చాన్స్ రాలేదన్న అభిప్రాయం పెరుగుతుందని వెనక్కు తగ్గారు. ఇప్పుడు కేంద్ర మంత్రి పదవి కూడా ఆయనకే ఇవ్వడంతో పార్టీలో వలస నేతలకు మాత్రమే ప్రాధాన్యనం అనే ముద్రను చెరిపేయడానికి.. కిందిస్థాయి నుంచి పని చేసే కార్యకర్తలకు భరోసా ఇవ్వడానికి శ్రీనివాసవర్మకు చాన్సిచ్చారని చెబుతున్నారు. ఆయనకు పదవి ఖరారు కాగానే సోము వీర్రాజుతో సంతోషం పంచుకున్నారు. ఎన్నికల్లో పోటీ కోసం గట్టిగా ప్రయత్నించిన విష్ణువర్ధన్ రెడ్డి కూడా కొత్త కేంద్రమంత్రిని అభినందించారు. బీజేపీలో వార్డు మెంబర్ నుంచి కేంద్ర మంత్రిగా అయిపోవచ్చని వర్మ నిరూపించారు.ఆ భరోసా వర్మకు పదవి ఇవ్వడం ద్వారా పార్టీనే నమ్ముకున్న సీనియర్లకు, క్యాడర్ కు పంపింది. సీనియర్లకు మంచి భవిష్యత్ ఉంటుందన్న సంకేతాలను వర్మకు పదవి ద్వారాపంపారని అనుకోవచ్చు.

## నాడు లగడపాటి.....నేడు కేశినేని నాని......

### రెండుసార్లు గెలిచి రాజకీయ సన్యాసం





**విజయవాడ, జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):**కాకతాళీయమో.. విధి విచిత్రవెూ తెలీదు కానీ, రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యహరించిన విజయవాడ మాజీ ఎంపీలిద్దరు అనూహ్యంగా రాజకీయ సన్యాసం పుచ్చుకున్నారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి రెండుసార్లు గెలుపొందిన లగడపాటి రాజగోపాల్.. రాష్ట్ర రాజకీయాల్లో సంచలన నేతగా పేరుగాంచారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా తనదైన శైలిలో పోరాడిన ఘన చరిత్ర లగడపాటి సొంతం. విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందే సమయంలో పెప్పర్ స్ప్రే కొట్టి వార్తలోకెక్కిన లగడపాటి.. రాష్ట్ర విభజన తర్వాత రాజకీయ సన్యాసం పుచ్చుకున్నారు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన కేశినేని శ్రీనివాస్ (నాని) తొలినాటి నుంచి వివాదాస్పద నేతగా పేరుగాంచారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయ రంగంలో అడుగిడిన నాని, అక్కడ ఇమడలేక టీడీపీలో చేరారు. 2019లో వైసీపీ ప్రభంజనంలోనూ గెలుపొందిన కేశినేని నాని.. పలు వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, పలుమార్లు ధిక్కారస్వరం వినిపించారు. నాని ప్రవర్తనతో విసిగిపోయిన చంద్రబాబు, విజయవాడ పార్లమెంట్ టిక్కెట్టును కేశినేని నాని సోదరుడు కేశినేని శివనాథ్ (చిన్ని)కి కేటాయించారు. తదనంతర పరిణామాల్లో, నాని వైసీపీలో చేరడం.. తన సోదరుడి చేతిలో ఓటమి పాలవ్వడం చకచకా జరిగిపోయాయి. ఎంపీగా హ్యాట్రిక్ కొట్టాలని ఆశించిన కేశినేని నాని ఆశలు నెరవేరకపోవడంతో, రాజకీయాల నుంచి వైదొలగుతున్నట్లు నాని ప్రకటించారు. దీంతో, విజయవాడ నుంచి గెలిచిన తాజా మాజీ ఎంపీలిద్దరూ రాజకీయ సన్యాసం పుచ్చుకోవడం గమనించదగ్గ విషయం.

## కొంపముంచిన షాడో సీఎం

**విజయవాడ, జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి )::** ఆంధ్రప్రదేశ్ లో మొన్న జరిగిన ఎన్నికలు వైసీపీ కొంప ముంచాయి. జగన్ మ్యానియా పని చేస్తుందని, సంక్షేమ పథకాలు గట్టెక్కిస్తాయని.. సామాజిక న్యాయం తమకు న్యాయం చేస్తుందని భావించిన వైసీపీ చివరికి చతికిల పడింది. 2019లో 151 సీట్లు ఇచ్చిన ప్రజలు.. 2024 ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసి దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యే తీర్పు నిచ్చారు. ఈ తారుణంలోనే ఓటమికి గల కారణాలను ఎవరికి నచ్చినట్లు వాళ్లు ఆలోచిస్తున్నారు. కానీ అన్నంటికంటే అసలు కారణం జగన్ చుట్టు వుండే కోటరీ అనేది జగమెరిగిన సత్యం.జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు చేసిన ప్రతి పనిలో జగన్ కి 10 శాతం ప్రమేయం ఉంటే చుట్టూ ఉండే కోటరీది 90 శాతం పాత్ర ఉంటుంది. అటు ప్రజలతో పాటు ఇటు పార్టీ నేతల్లో కూడా జగన్ పై వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణం కోటరీలో ఉండే ఆ ఇద్దరే అని నేతలంతా గళం విప్పుతున్నారు. వారి వల్లే ఈ స్థాయిలో పార్టీ దెబ్బతిందని వైసీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కనిపించే సీఎం జగన్ ఒకరైతే.. కనపడని షాడో సీఎం మరొకరు ఉన్నారు. సీఎం తర్వాత తానే సీఎం అనేంత రేంజిలో బిజీబిజీగా గడుపుతూ.. ప్రతి ప్రభుత్వం మీటింగ్ లోనూ.. ప్రైవేట్ మీటింగ్ లోనూ తానే కనపడేవారు. ఈ తరహా వైఖరిపై విమర్శలు వస్తున్నప్పటికీ.. మళ్లీ అదే రిపీట్ చేస్తూ.. చివరికి పార్టీ పతనానికి కూడా ఒక కారణం అయ్యారు. అతనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.ప్రభుత్వంలో ఏ నిర్ణయం తీసుకున్నా.. ఎవరికి మంత్రి పదవులు రావాలన్నా.. ఎవరికైనా పోస్ట్ కేటాయించాలన్నా.. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి అధికారుల వరకు.. బదిలీ చేయాలన్నా సజ్జల అనుమతి లేనిదే.. సీఎం జగన్ చేయడమే టాక్ పెద్ద ఎత్తున నడిచింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిన్నా మొన్నటి వరకు కూడా ఇదే నడిచిందని భాహటం గానే సొంత నేతలు సైతం విమర్శలు గుప్పించారు. సజ్జల రామకృష్ణారెడ్డి వల్లే పార్టీ ఇంతలా దిగజారి పోయిందని.. 11 సీట్లకే పరిమితం అయ్యిందని ఫైర్ అవుతున్నారు.ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశ వర్కర్స్.. ఇలా ఎవరితో చర్చలు జరిగిన.. ప్రతి సందర్భంలోనూ సజ్జల వీరు ఎవరు తమ ఓటు బ్యాంకు కాదని కించ పరిచే విధంగా మాట్లాడేవారు. ఈ మాటలే ఎన్నికల్లో రిఫ్లెక్ట్ అయ్యాయని చాలా మంది భావిస్తున్నారు




నూజివీడు శాసనసభ్యులుగా సంచలన విజయం సాధించిన మాజీ మంత్రి కొలుసు పార్థసారధి ని సత్కరించి, శుభాకాంక్షలు తెలుపుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పట్టే బోయిన మాల కొండయ్య యాదవ్ తో పాటు అఖిల భారత యాదవ మహాసభ నాయకులు పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, కొలుసు లాలా లజపతిరాయ్, అంబటి వెంగయ్య యాదవ్, బత్తుల రాజయ్య యాదవ్, జోగా ప్రవీణ్ యాదవ్ తదితరులు

–విజయవాడ,జూన్ 11 (వార్తాప్రభ) :

# అఖండ విజయానికి... ఆత్మీయ సన్మానం



**కంకిపాడు,జూన్ 11 (వార్తాప్రభ) :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో యన్‌డిఏ కూటమి ప్రభుత్వం అఖండ విజయం సాధించిన విషయం విధితమే. దీనిలో భాగంగా కంకిపాడు గ్రామంలో పోలింగ్ సరళిలో పాల్గొన్న బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలకు సన్మాన కార్యక్రమం మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు చలవాది రాజా అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ మాట్లాడుతూ గత నెల 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో కంకిపాడు గ్రామంలో ఆయా బూత్ స్థాయిలో ఎన్నికల సరళి ప్రశాంతంగా మ–ంగియడానికి బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిల కృషి అభినందనీయమన్నారు. అదే విధంగా పోలింగ్ రోజున ఉదయం నుంచి పోలింగ్ ముగిసే సమయం వరకు ఎంతో ఓర్పుతో విధులు నిర్వహించారన్నారు. ఈ సందర్భంలో పోలింగ్ శాతం భారీగా పెరిగి తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీ బలపరిచిన పెనమలూరు నియోజకవర్గ అభ్యర్ధి బోడే ప్రసాద్ భారీ మెజార్టీతో గెలుపొందారన్నారు. ఈ విజయంలో కంకిపాడు గ్రామానికి చెందిన ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు యస్. రంగారావు, యలమంచిలి కిషోర్ బాబు, బండి నాంచారయ్య, దూళిపూడి కిషోర్, బోయిన నాగరాజు, వణుకూరు విక్రం, పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూజివీడులో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణం త్వరలో చేపడతాం

## ఎమ్మెల్యే గొలుసు పార్ధసారధి సతీమణి కమల లక్ష్మి



**నూజివీడు,జూన్ 11 (వార్తాప్రభ) :** నూజివీడులో ప్రజాధనం నిరుప యోగం అవుతున్నా, మాజీ ఎమ్మె ల్యే ఐదేళ్ల పాలనలో ఎప్పుడు పట్టి ంచుకోలేదని, నూజివీడు అభివృద్ధి కోసం ఏనాడు పనిచేయలేదని నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్ధసారథి సతీమణి కొలుసు కమల లక్ష్మి విమర్శించారు. నూజి వీడులో అసంపూర్తిగా మిగిలిపో యిన ఇండోర్ స్టేడియం ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాయని, అనంతరం చంద్రబాబు నాయుడు పాలనలో 80% పూర్తయింది అన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఏ రోజు ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ఆసక్తి చూపలేదని, కోట్ల రూపాయలు ప్రజాధనం నిరుపయోగం అవుతున్న పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో తప్పకుండా ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయటం జరుగుతుందని కమల లక్ష్మి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు మలిశెట్టి జగదీష్, పల్లె నాగరాజు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ శాసనసభ పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన అనంతరం మాట్లాడిన పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

విజయాన్ని అందించారు. వారి నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంచుకునేలా పనిచేయడం మనముందున్న బాధ్యత. పాలకొండ వెళ్లినప్పుడు అక్కడ పంట పొలాల్లోకి ఏనుగులు చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయని చెప్పారు. అలాగే రాష్ట్రంలో మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చాలా తక్కువ నిధులు వెచ్చిస్తే పూర్తయ్యేవి ఉన్నాయి. అలాంటి సమస్యలను వెంటనే తీర్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఈ ఎన్నికల్లో విద్య, వైద్యం, ఉపాధి, భద్రత, సాగు, తాగు నీరు కల్పిస్తామని ప్రజలకు పూర్తి స్థాయిలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాం. దానికి మన పార్టీ ఎమ్మెల్యేలు కట్టుబడి పని చేయాలి. ముఖ్యంగా గత ప్రభుత్వంలో శాంతి భద్రతలు అంతంత మాత్రంగానే ఉండేవి. ప్రజల భద్రతకు కూటమి ప్రభుత్వంలో పూర్తి స్థాయి భరోసా ఉంటుంది. రాజకీయాల్లో కొత్త తరం వచ్చి ఓటు వేసింది. యువతరం మనల్ని బలంగా నమ్మింది. ఎంతో నమ్మకంగా ఓటు వేసిన వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయకపోతే అంతే బలంగా నిలదీస్తారని గుర్తు పెట్టుకోండి. ప్రజలు కోపంతో ఒక్కోసారి మాట మాట్లాడినా దానిని వేరుగా తీసుకోవద్దు. వారి ఆగ్రహానికి కారణాలు ఏంటో వెతకండి. వాటిని పరిష్కరించేలా పనిచేయండి.

# దేశాయ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో బాలకృష్ణకు జన్మదిన వేడుకలు




**నందవరం,జూన్ 11 (వార్తాప్రభ) :** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరంలో దేశాయి నెట్వర్క్ కార్యాలయంలో గురు రాజ్ దేశాయ్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా దేశాయ్ యూత్ సభ్యులు టిడిపి జనసేన నాయకులు కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా దేశాయ్ గురు రాజ్ మాట్లాడుతూ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి గెలుపు కోసం ఎమ్మిగనూరులో పర్యటన చేసిన నందమూరి బాలకృష్ణ కి మరొకసారి ధన్యవాదములు తెలిపారు అదే విధంగా రాష్ట్ర మంత్రివర్గ స్థానంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డికి అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు నీ కోరారు గతంలో మాజీ మంత్రివర్యులు బివి మోహన్ రెడ్డి కి రోడ్డు రవాణా శాఖ మంత్రి కల్పించారు అదేవిధంగా మాజీ మంత్రివర్యులు మోహన్ రెడ్డి కుమారుడు డా.క్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి కి మంత్రి పదవి కల్పించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సంజీవ్ స్వామీ రామన్న గౌడ్ దేశాయ్ యూత్ సభ్యులు సాదిక్ తోట పాండు కళ్లెల శివ సంజీవ్ దానెల్ అబ్దుల్ అజయ్ మల్లేష్ విరెష్ చిన్నారులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# సేవను అలవాటుగా చేసుకోవాలి డా. చప్పిడి

**కాకినాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యం లో డి సి ఎస్ అలై కిరణ్ కుమార్ వారి మాతృమూర్తి పి.మరియమ్మ పుట్టినరోజు సందర్భంగా కాకినాడ మెహర్ నగర్ లో ఉన్న మానవీయ వృద్దుల ఆశ్రమంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి ఆశ్రమంలో గల వృద్దులకు భోజన సదుపాయం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిస్ట్రిక్ట్ 106 తూర్పుగోదావరి జిల్లా గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు విశిష్ట అతిధిగా అలయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్మన్ అలై డా.చప్పిడి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. గవర్నర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ మరియమ్మ విశాఖపట్నంలో కూతురి దగ్గర నివాసం ఉండుట వలన ఆమె రాలేని కారణంగా వారి కుమారుడు కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయం అన్నారు అనంతరం డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మరియమ్మ వైద్య ఆరోగ్య శాఖలో పీహెచ్ ఎన్ గా పని చేసి రిటైర్ అయ్యారని ఆమె మంచి సర్వీస్ చేసి ప్రజల యొక్క మన్నలను పొందారని,ఆమె రాలేక పోయినప్పటి ఆమె కుమారుడు మంచి కార్యక్రమం చేసి తల్లి మీద ప్రేమ చాటుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముందుగా కేకు కట్ చేసి వృద్దులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి దుర్గా సుభద్ర ,మేము సైతం మీకోసం క్లబ్ అధ్యక్షుడు గణేష్,రెయిన్బో క్లబ్ అధ్యక్షురాలు సుందరి,సబిత, అనీల్, జోన్ చైర్మన్ నాగేంద్ర,దుర్గా దేవి,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అనురాధకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి



**అమరావతి,జూన్ 11 (వార్తాప్రభ) :** టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధకు మంత్రి వర్గంలో చేనేత, జౌళి శాఖ మంత్రిగా అవకాశం ఇవ్వాలని ఏపీ చేనేత కులాల, సంఘాల ఐక్యవేదిక సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. చేనేత వర్గం గెలవడానికి అవకాశం ఉన్న మంగళగిరి, చీరాల, పెడను వంటి స్థానాలను తమకు కేటాయించనందున, చేనేత వర్గానికి చెందిన అనురాధకు మంత్రి పదవి ఇవ్వాలని వారు కోరారు. తమది న్యాయమైన కోరికని తెలిపారు. పద్మశాలి ఆడబిడ్డ అనురాధకు మంత్రి పదవి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మునగపాటి వెంకటేశ్వర రావు కూడా కోరారు.

# ఎంసెట్ లో స్టేట్ ర్యాంకులతో ఆదిత్య జయకేతనం



**కాకినాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** ఏపీ ఈఏపీ –2024 ఫలితాలలో ఆదిత్య విద్యార్థులు అత్యున్నత స్టేట్ ర్యాంకులు సాధించి ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో ఆదిత్య శిక్షణాపటిమను, ఆధిక్యతను మరోమారు ఋజువుచేసారు. అగ్రికల్చర్ లో స్టేట్ ఫలితాలలో ఎన్. హెచ్. డి. ఎస్. ఎస్. రవి కిరణ్ 13 వ ర్యాలకు, వై. నమితా రాణి 31 వ ర్యాంకు, కె. ఎస్.బి.టి. సుందరి 67 వ ర్యాంకు,వి. సృజన్ 76 వ ర్యాంకు, ఎమ్. విశ్వంత్ 79వ ర్యాంకును సాధించారు. ఇంకా 114, 156, 198, 205.. .. మరెన్నో అత్యుత్తమ, అత్యధిక ర్యాంకులను విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ లో స్టేట్ ఫలితాలలో బి. ఆర్. రామ్ సహన్ 25 వ ర్యాంకు, జి. ఫణింద్ర 47 వ ర్యాంకు, బి. రోహిత్ చౌదరి 57వ ర్యాంకును సాధించారు. ఇంకా 100, 112, 129, 153, 166, 170 ...... మరెన్నో అత్యుత్తమ, అత్యధిక ర్యాంకులను విద్యార్థులు సాధించారు. అత్యున్నత స్టేట్ ర్యాంకులు సాధించి, ఆదిత్య ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అగ్రగామినని ఋజువు చేసుకొందని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్. శేషారెడ్డి అన్నారు. విద్యా ర్థుల స్థాయిని బట్టి ప్రణాళికలు రూపొందిం చటం వల్లనే ఇలాంటి అద్భుత విజయాలను ఆదిత్య విద్యార్థులు సాధిస్తున్నారని ఆదిత్య విద్యాసంస్థల సెక్రటరీ ఎన్. కె. దీపక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.,100 500 ర్యాంకులలోపు 39 మంది, 1000 ర్యాంకులలోపు 62 మంది, విద్యార్థులు అత్యుత్తమ స్టేట్ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల హాస్టల్ డైరక్టర్ ఎన్. లక్ష్మీరాజ్యం,ఆదిత్య విద్యాసంస్థల డైరక్టర్ ఎన్. శృతి, డైరక్టర్ ఎన్. సుగుణ, ఐఐటి ప్రిన్సిపాల్ జె. మొయిన, కో–ఆర్డినేటర్ కె. లక్ష్మీకుమార్,అకడమిక్ డైరక్టర్ ఎస్. వి.రాఘవరెడ్డి,ఎస్. పి. గంగిరెడ్డి,పి.సత్యనారాయణ రెడ్డి, ఐఐటి క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ ఎమ్. ఫణీంద్ర,ఆదిత్య నిర్వహణలో గల ఇతర కేంద్రాలలో గల కళాశాలల ప్రిన్సిపాల్స్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఉత్తమ శిక్షణనందించిన అధ్యాపకవర్గాన్ని అభినందించారు.

# చంద్రబాబు పట్టాభిషేకానికి అంతా రెడీ : ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

- సభా ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలన నాయకులు, అధికారులకి సలహాలు, సూచనలు

**గన్నవరం,జూన్ 11 (వార్తాప్రభ) :** టిడిపి అధినేత, ఎన్డీయే కూటమి శాసనసభ పక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేయబోయే ప్రమాణ స్వీకార మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి మేధ టవర్స్ పక్కన వున్న 17 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ పనులు, సభా వేదికను మంగళవారం కేశినేని శివనాథ్, ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజుతో కలిసి పర్యవేక్షించారు. స్టేజ్ ముందు ఏర్పాటు చేసిన వివిఐపి, విఐపి గ్యాలరీలను పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యకర్తలకు తాగునీటి సప్లై, పారిశుద్ధ్య నిర్వహణ గురించి అధికారులతో మాట్లాడి ఆ వివరాలు తెలుసుకున్నారు. ఇక ప్రోటో కాల్ పరంగా ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఎదురవకుండా చూడాలని పోలీసులు ఉన్నతాధికారులకు సూచించారు. సభా ప్రాంగణం మొత్తం తిరిగి జరుగుతున్న పనులను పరిశీలించటంతో పాటు, వివిధ రాష్ట్రాల నుంచి రాబోతున్న నాయకుల కోసం ఏర్పాటు చేసిన వసతి సదుపాయలను కూడా పరిశీలించారు.



చంద్రబాబు ప్రమాణ స్వీకరా మహోత్సవం ఒక పండుగ వాతావరణ ంలా జరగాలని నాయకులకి, అధికారులకి సూచించి అందుకావాల్సిన విధంగా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని కోరారు.

# ఈ యోగా ముద్రతో సంతానలేమి దూరమవుతుందట..





## వార్తాప్రభ ఆరోగ్య చిట్కాలు



ఆసనాలు, యోగా ముద్రలు చాలా పవర్‌ఫుల్. దీని కారణంగా ఎన్నో బెనిఫిట్స్ ఉన్నాయి. అందులో భాగంగా.. ఆపానా ముద్ర వేయడం వల్ల ఏయే లాభాలున్నాయో తెలుసుకోండి. ముద్రలు చేయడం చాలా ఈజీగా ఉంటాయి. కానీ, వీటిని చేయడం వల్ల చాలా లాభాలున్నాయి. వీటిని మీరు ఊహించలేరు కూడా. దీని వల్ల బాడీలో పాజిటీవ్ మార్పులని గమనిస్తారు. ఆపానా ముద్రని ఎలా వేయాలి.. దీని వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

**ముద్ర ఎలా వేయాలంటే..** ముందుగా పద్మాసనంలో కూర్చోవాలి. రెండుచేతులని తొడలపై ఉంచాలి. బొటనవేలు, మధ్యవేలు, ఉంగరపువేలు గుండ్రంగా ఉంచండి. చిటికెనవేలు,చూపుడువేలు చాచి ఉంచాలి. డీప్ బ్రీథ్ తీసుకోండి. దీనిని 15 నుంచి 20 నిమిషాలు ఉంచాలి.

**శక్తి..** మీరు రెగ్యులర్‌గా ఆపాన ముద్ర వేస్తే బాడీలో శక్తి పెరుగుతుంది. అలసట లేకుండా ఉంటారు. జీవశక్తి పెరుగుతుంది.

**ఫెర్టిలిటీ..** ఆపాన ముద్ర చేయడం వల్ల స్త్రీపురుషల్లో పునరుత్పత్తి మెరగవుతుంది. ఇది ఆడవారిలో పీరియడ్స్‌ని కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. రుతు సమయంలో వచ్చే తిమ్మిరిని తగ్గిస్తుంది. ఒక్కోసారి మన ఆలోచనలు కంట్రోల్‌లో ఉండవు.

**ఎమోషన్స్ కంట్రోల్..** అలాంటప్పుడు ఈ ఆసనం చేస్తే మన మానసికు స్పష్టత మెరుగై ఎమోషన్స్ కంట్రోల్ అవుతాయి.

**డీటాక్స్..** మీరు బాడీని డీటాక్స్ చేయాలనుకుంటే డీటాక్స్ డ్రింక్స్, మెడిసిన్ తీసుకోండి. దీని కోసం ఆపాన ముద్ర వేయడం వల్ల బాడీ డీటాక్స్ అవుతుంది. దీని వల్ల మూత్ర నాళం క్లీన్ అవుతుంది. ఈ ముద్ర చేయడం వల్ల పిత్తాశయం పనితీరు మెరుగవతుంది. మీరు రెగ్యులర్‌గా చేస్తే శరీరం స్ట్రాంగ్ అవుతుంది. రక్తంలోని టాక్సిన్స్ తొలగి పిత్తాశయ రాళ్ళు ఏర్పడకుండా చేస్తాయి.

**జీర్ణ వ్యవస్థ..** ఈ ముద్ర వేయడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగ్గా మారుతుంది. దీని దీని వల్ల మన తినే ఆహారంలోని పోషకాలను శరీరం పూర్తిగా గ్రహించి జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగవుతుంది.

# ప్రెగ్నెంట్స్ ఇలా యోగా చేస్తే డెలివరీ టైమ్‌లో నొప్పులు కాస్తా తగ్గుతాయట..



ప్రెగ్నెంట్స్‌గా ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మరి ఈ టైమ్‌లో యోగా చేయొచ్చా.. దీని గురించి ప్రెగ్నెంట్స్ ఏ విషయాల గురించి తెలుసుకోవాలో ఇక్కడ చూడండి. ప్రెగ్నెన్సీ అనేది ఆడవారి జీవితంలో ఓ ముఖ్య ఘట్టం, ఈ సమయంలో ఆడవారిలో ఎన్నో మార్పులు రావడం సహజం. అందుకోసం ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని అన్ని విధాలుగా కాపాడుకోవడం ముఖ్యం. దీని కారణంగా ఆడవారిలో ప్రతి ఒక్క విషయం మారుతుంది. ఆమె ప్రతి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా ప్రాక్టీస్ చేయొచ్చు. దీని గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం..

**ప్రినేటల్ యోగా..** తల్లులకి ప్రినేటల్ యోగా చాలా అవసరం. వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడడంలో ఈ యోగా హెల్ప్ చేస్తుంది. అందుకు ఆడవారు హెల్దీ యోగాసనాల గురించి తెలుసుకోవడం, ప్రాక్టీస్ చేయడం చాలా ముఖ్యం. ప్రసవానికి ముందు ఏ యోగాసనాలు చేస్తే మంచిదో, ఏవి చేయకూడదు. అవగాహన ఉండాలి.

**యోగాతో బెనిఫిట్స్..** ప్రసవానికి ముందు వాపు వంటి కొన్ని సమ–స్యలుంటాయి. దీని కోసం యోగా చేస్తే రక్త ప్రసరణ సులభమవుతుంది. దీంతో ఈ సమస్య తగ్గుతుంది. ప్రినేటల్ యోగా మిమ్మల్ని బ్యాలెన్స్‌గా ఉండేందుకు హెల్ప్ చేస్తుంది. ప్రెగ్నెన్సీ కారణంగా మీ బాడీలో మార్పులు వస్తే ప్రినేటల్ యోగా మీకు రెస్ట్‌ని ఇస్తుంది.

**ప్రొఫెషనల్ హెల్ప్..** ప్రెగ్నెన్సీ టైమ్‌లో యోగా చేస్తే కండరాలు బలపడి ప్రసవానికి హెల్ప్ అవుతాయి. అన్నికంటే, ముఖ్యంగా, మీరు ఆరోగ్యంగా ఉండేందుకు యోగా గొప్ప మార్గం. ఈ సమయంలో యోగా చేయడం మంచిదే. కానీ, సొంతంగా చేయొద్దు. ప్రొఫెషనల్స్ హెల్ప్ తీసుకోవడం చాలా ముఖ్యం. వారి సలహా మేరకు యోగానికి మీ డెయిలీ రొటీన్‌లో యాడ్ చేసుకోండి.

**ఇలా చేయొద్దు..** ప్రెగ్నెన్సీ టైమ్‌లో ఖాళీ కడుపుతో యోగా చేయొద్దు. ఇలా చేస్తే తలతిరుగుతుంది. ముఖ్యంగా కొంతమందికి ఉదయాన్నే కొన్ని సమస్యలు ఉంటాయి. వారు ఖాళీ కడుపుతో యోగా చేస్తే వికారం వంటి సమస్యలు పెరుగుతాయి. ఈ సమస్యల్ని తగ్గించేందుకు లైట్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి. అదే విధంగా శరీరాన్ని వేడికి గురిచేసే హాట్, బిక్రమ్ యోగాకి దూరంగా ఉండాలి. దీని వల్ల పిండంపై ఎఫెక్ట్ పడుతుంది.

**యోగా చేసేటప్పుడు..** గర్భిణీలు యోగా చేసేటప్పుడు వారి హార్ట్ బీట్, బ్రీథింగ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాలి. విపరీతమైన ఒత్తిడి, డీహైడ్రేషన్ కొన్ని సమస్యలకి దారి తీస్తుంది. దీంతో అలసట, తలతిరగడం వంటి సమస్యలుంటాయి అలా కాకుండా ఎప్పుడూ నీరు తాగి హైడ్రేటెడ్‌గా ఉండండి.










## నీట్ పై సమగ్ర విచారణ జరిపించాలి : ఎస్.ఎఫ్.ఐ

**గుడివాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** నీట్ ఫలితాలపై ఆరోపణల దృష్ట్యా వెంటనే సమగ్ర విచారణ చేయించాలని, తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి లు ప్రేమ్ మరియు ఎస్. సమరం లు కోరారు. నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. అదే సెంటర్లో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ కాగా, ఆమెకు 636 మార్కులకు గాను 720 మార్కులు వచ్చాయనీ.. దీనిపై చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. చాలా మందికి 718, 719 మార్కులు ఎలా వచ్చాయనీ అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుంటే జూన్ 14న విడుదల చేయాల్సిన ఫలితాలు, జూన్ 4వ ఎలా విడుదల చేశారనీ, దీనిపైనే అందరికీ సందేహాలున్నాయన్నారు. తక్షణం విచారణ చేయించి అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు గైకొనాలనీ వారు కోరారు.

## బాబును చూడాలి అంటూ కాన్వాయ్ వెంట మహిళ పరుగులు : కారు ఆపి మాట్లాడిన చంద్రబాబు



**విజయవాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయుడుని చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రోడ్ల మీదకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు దారి పొడవునా స్వాగతం పలికారు. ఎ కన్వెన్షన్ లో కూటమి సమావేశం అనంతరం ఉండవల్లి ప్రయాణమైన చంద్రబాబును చూసేందుకు మదనపల్లికి చెందిన ఓ మహిళ కాన్వాయ్ వెంట పరుగులు పెట్టింది. ఆ మహిళను కారు లోంచి చూసిన చంద్రబాబు వెంటనే కాన్వాయ్ ను ఆపి ఆ మహిళను దగ్గరకు పిలిచి మాట్లాడారు. తనది మదనపల్లి అని తన పేరు నందిని అని చెప్పిన ఆ మహిళ చంద్రబాబుపై అభిమానంతో చూడడానికి వచ్చాను అని చెప్పింది. తనను చూసి ఎమోషన్ అయిన ఆ మహిళతో చంద్రబాబు మాట్లాడారు. సెక్యూరిటీని వారించి ఆమె వివరాలు తెలుసుకున్నారు. మా కష్టం ఫలించి మా కోరిక మేరకు మీరు సిఎం అయ్యారు సార్. ఒక్క సారి మీ కాళ్లు మొక్కుతాను అంటూ ఆ మహిళ అనగా... చంద్రబాబు సున్నితంగా వారించారు. ఆమెను ఆప్యాయంగా పలకరించి ఆమెతో ఫోటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడడాలని వచ్చాను అని నందిని చెప్పగా ముందు ఆసుపత్రికి వెళ్లు అంటూ సూచించారు. ఆమె ఎక్కడ ఉంటారో తెలుసుకుని అవసరమైన వైద్యం సాయం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబు నాయుడు సూచించారు.

## వెలమల సంఘీయుల అభివృద్ధికి కింజరపు సేవలు అభినందనీయం

### వెలమ సంక్షేమ సంఘం, గుడివాడ వారీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం..



**గుడివాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** భారతదేశ కేంద్ర క్యాబినేట్ మినిస్టర్గా శ్రీకాకుళం హ్యాట్రిక్ పార్లమెంట్ సభ్యులు కింజరపు రామోహన్ నాయుడు ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భాన్ని పురస్కరించుకొని వెలమ సంక్షేమ సంఘం, గుడివాడ వారీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ఆనందోత్సహాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టి.డి.పి సీనియర్ నాయకులు డా॥ గోర్జి సత్యనారాయణ మాట్లాడుతూ వెలమల అభివృద్ధికి కింజరపు ఎర్రంనాయుడు కుటుంబం ముఖ్యంగా రాజకీయంగా, సామాజికంగా మరియు ఆర్థికంగా బలోపేతం కావడానికీ ఎంతగానో కృషి చేసిందనీ అన్నారు. ఈ క్రమంలో రామోహన్ నాయుడు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అందించే సేవలు.. అలాగే వెలమ జాతికీ పూర్వవైభవం.. సద్వినియోగ పర్చుకోవాలనీ పిలుపునిచ్చారు. టిడిపి మాజీ కౌన్సిలర్ బొడ్డు శివశ్రీ మరియు మరడానీ వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ వెలమ సంఘీయులకు ఈరోజు చాలా ముఖ్యమైన గర్వించిదగిన రోజున్నారు. ముఖ్యంగా రామోహన నాయుడు తండ్రిని మించిన తనయుడు అయ్యాడనీ ప్రశంసించారు. పార్టీ పరంగా చంద్రబాబు అందించిన సహాకారం.. అలాగే సంఘీయులందరూ చంద్రబాబుకు మద్ధతుగా నిలవానీ శివశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం నాయకులు బొడ్డు నారాయణ, బూరాడ మధుసూదన రావు తదితరులు.. వెలమ సంఘీయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గొల్లపూడి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవినేని ఉమా మహేశ్వరరావు ను సోమవారం తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి) మర్యాద పూర్వకంగా కలిసిన దృశ్యం. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీల విజయంపై ఇరువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
–గుడివాడ,జూన్ 11 (వార్తాప్రభ) :

## ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు పోరాటం ఉధృతం

- గుడ్లవల్లేరు మండల నాయకులు బి.వి. శ్రీనివాసరావు






**గుడ్లవల్లేరు (వలవపూడి),జూన్ 11 (వార్తాప్రభ) :** కేంద్రలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, 200 రోజులు పని దినాలు చూపించాలని, రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక వులవపూడి లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి అనంతరం సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీ ని ఎన్నుకొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా పమర్తి శ్రీరామూర్తి, కార్యదర్శిగా మొదుగుగుమూడి శివకీర్తి, సహాయ కార్యదర్శిగా పామర్తి రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులుగా సూరగని ఆదిలక్ష్మి, డోకిపర్తి రమణమ్మ, పామర్తి సుబ్బమ్మ, అరెపల్లి సాంబశివరావు, యార్లగడ్డ వెంకటేశ్వరమ్మ, ఉయ్యూరు వెంకటేశ్వరరావు, కారుమంచి గణేష్ లను ఎన్నుకొన్నారు. ఎఫ్.ఏ.. కు 26 వేలు, మెస్త్రీకి 10 వేలు జీతం ఇవ్వాలని, పలుగు, పారా, మంచినీరూ తదితర సౌకర్యాలను గతంలో మాదిరిగా పునరుద్ధరించాలని, ఆన్ లైన్ మాస్టర్ విధానం రద్దు చేయాలంటూ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు.

**సమస్యలు పరిష్కరించకుండ డబ్బులు కట్టమనడం దారుణం.. :** టిడ్కో రుణ లబ్ధిదారుల రుణాలు కట్టాలని బ్యాంక్ అధికారులు మెప్మా అధికారులు ఒత్తిడి చేస్తున్నారని లబ్ధిదారులు తెలిపారు, ఈ క్రమంలో దాన్ని ఆపాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి కోరారు. మంగళవారం ఉదయం స్థానిక సీపిఎం ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో అనేక ఇబ్బందులు ఉన్నాయనీ, ఇందులో డ్రైనేజీ సమస్య.. చెత్త సమస్య మరియు వాటర్ సమస్య మొదలైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా లబ్ధిదారుల్ని డబ్బులు కట్టమని బ్యాంకులు ఒత్తిడి చేయటం మంచి పద్ధతి కాదని రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఐద్వా సెక్రెటరీ పి రజిని తదితరులు పాల్గొన్నారు.

## నెరవేరిన "నారా" పంతం - మంత్రి పదవి సొంతం..!!

### 2024 ఏపీ రాష్ట్ర యువత & క్రీడలు, వృత్తి నైపుణ్యం శాఖా మంత్రిగా వెనిగండ్ల రాము.. !



**గుడివాడ,జూన్ 11 (వార్తాప్రభ) :** ఏపీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. 144 సీట్లలో పోటీ చేస్తే 135 స్థానాలు దక్కించుకుంది. కూటమిగా 164 స్థానాల్లో ఏకపక్షంగా విజయం సాధించింది. అయిదేళ్ల కాలంగా టీడీపీ చేసిన పోరాటానికి ప్రజలు అండగా నిలిచారు. చంద్రబాబుతో పాటుగా ఆయన కుటుంబ సభ్యుల పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన కొడాలి నాని వంటి వారిని ఓడించాలని పార్టీ నేతలు శపథం తీసుకున్నారు. సాధించారు. అక్కడ నానిపై భారీ సాధించిన విజయాన్ని రాము పార్టీ అధినేతకు గిఫ్ట్ గా ఇచ్చారు.

**నెరవేరిన పంతం..** టీడీపీ ఈ ఎన్నికల్లో సంచలన విజయం సాధించింది. దశాబ్ద కాలంగా విజయం కోసం ఎదురు చూస్తున్న గుడివాడలో ఈ సారి వెనిగళ్ల రాము ఏకంగా 53,040 ఓట్లతో విజయం సాధించారు. గుడివాడలో నాని 2004 నుంచి ఎమ్మెల్యేగా కొనసాగారు. మొదటి రెండు పర్యాయాలు టీడీపీ నుంచి గెలిచిన నాని.. ఆ తర్వాత రెండుసార్లు జగన్ పార్టీ నుంచి గెలుపొందారు. అయితే, జగన్ కేబినెట్ లో మంత్రిగా ఉన్న సమయంలోనూ.. ఆ తరువాత చంద్రబాబు, లోకేష్ తో సహా కుటుంబ సభ్యుల పైన అనుచిత వ్యాఖ్యలు చేసారు. నాని పైన సాధారణ ప్రజల్లోనూ ఈ తీరుతో ఏహ్య భావం మొదలైంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా నానిని ఓడించాలని చంద్రబాబు, లోకేష్ డిసైడ్ అయ్యారు.

**అనూహ్య విజయం..** నాని ఓటమి కోసం పార్టీ నుంచి సమర్ధవంతమైన అభ్యర్ధిగా వెనిగళ్ల రామును ఎంపిక చేసారు. రాము గుడివాడలో విజయం కోసం వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటుగా పార్టీలో అందరినీ కలుపుకుపోతూ పని చేసారు. రైతులు, మహిళలకు కష్ట సమయంలో అండగా నిలిచారు. ఎన్నికల సమయం వరకు తనకు తిరుగు లేదని..చంద్రబాబు వచ్చినా తనను ఓడించలేరంటూ నాని గొప్పలు చెప్పుకున్నారు. కానీ, వెనిగళ్ల రాము గుడివాడలో కొడాలి నాని పైన విజయం సాధించారు. కౌంటింగ్ ప్రారంభమైన కాసేపటికే నాని ఫలితం అర్థం అవ్వటంతో ఇంటి ముఖం పట్టారు. ఈ ఎన్నికల్లో రాముకు 109,980 ఓట్లు పోలవ్వగా.. నానికి 56,940 ఓట్లు మాత్రమే దక్కాయి. ఫలితంగా అనూహ్యమైన మెజార్టీతో రాము విజయం సాధించారు.

**యువత & క్రీడలు మరియు వృత్తి నైపుణ్యం శాఖా మంత్రిగా..** గుడివాడలో ఎలాగైనా గెలవాలనే చంద్రబాబు, లోకేష్ పంతం రాము నెరవేర్చారు. చంద్రబాబుకు గుడివాడ విజయం గిఫ్ట్ గా ఇస్తున్నట్లు చెప్పారు. నారా– నందమూరి కుటుంబాలతో పాటుగా యావత్ పార్టీ శ్రేణులు కోరుకున్న విధంగా రాము గుడివాడలో నాని పైన విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా అందరూ రామును ప్రశంసించారు. దీంతో..ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడే కొత్త మంత్రివర్గంలో వెనిగళ్ల రాము కు ఛాన్స దక్కుతుందని పార్టీ ముఖ్య నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ మొత్తం గొప్పగా చెప్పుకొనే విజయం సాధించిన రాముకు మంత్రి పదవి ఇవ్వటం ద్వారా కేడర్ లో మరింత జోష్ పెరుగుతుందనే అభిప్రాయం ఉంది. దీంతో..రాముకు మంత్రి పదవి పైన చంద్రబాబు తుది నిర్ణయం ఏంటనేది వేచి చూడాలి..

## రవితేజ 75వ సినిమా ప్రారంభం .. రిలీజ్ చేసేది అప్పుడే!

- రవితేజ కథానాయకుడిగా 75వ సినిమా
- మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ జోనర్లో నడిచే కథ
- కథానాయికగా సందడి చేయనున్న శ్రీలీల
- దర్శకుడిగా భాను భోగవరపు పరిచయం




వార్తాప్రభ సినిమా..

రవితేజ – శ్రీలీల కాంబినేషన్ లో వచ్చిన 'ధమాకా' ఒక రేంజ్ లో వసూళ్ల సందడి చేసింది. రవితేజ అభిమానులను హుషారెత్తించింది. మళ్లీ రవితేజ నుంచి అలాంటి సినిమా వస్తే బాగుంటుంది .. మళ్లీ రవితేజ – శ్రీలీల కలిసి కనిపిస్తే కనువిందుగా ఉంటుందని అంతా అనుకున్నారు. అలా అనుకున్నవారి ముచ్చట దాదాపు తీరిపోయినట్టే అనుకోవాలి. ఈ ఇద్దరి కాంబినేషన్ లో ఒక సినిమా సెట్స్ పైకి వెళ్లింది. ఈ రోజునే ఈ సినిమా పూజా కార్యక్రమాలను జరుపుకుంది. రెగ్యులర్ షూటింగును కూడా మొదలెట్టేసింది. కెరియర్ పరంగా రవితేజకి ఇది 75వ సినిమా. సితార నాగవంశీ – సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా భాను భోగవరపు పరిచయమవుతున్నాడు. మాస్ యాక్షన్ జోనర్లో ఈ సినిమా రూపొందనుంది. కంటెంట్ కి ఇచ్చిన కామెడీ టచ్ కూడా గట్టిగానే ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం ఇతర తారాగణం ఎంపిక ప్రక్రియ కూడా నడుస్తుందని చెబుతున్నారు. భీమ్స్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

## మహేశ్ బాబు నా ఫంక్షన్స్ కి రాకపోవడానికి కారణం అదే: సుధీర్ బాబు

- సుధీర్ బాబు హీరోగా 'హరోం హర'
- ఈ నెల 14న విడుదలవుతున్న సినిమా
- ఆ దశలో తనకి మహేశ్ సాయం అవసరమని వ్యాఖ్య
- మహేశ్ సూచనలు ఎప్పటికీ ఉంటాయని వెల్లడి




మొదటి నుంచి సుధీర్ బాబు విభిన్నమైన .. విలక్షణమైన పాత్రలను చేస్తూ వెళుతున్నాడు. పాత్రకి తగినట్టుగా తెరపై కనిపించడానికి గట్టి కసరత్తులు చేస్తూ ఉంటాడు. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన కథలను మాత్రమే ఎంచుకుంటూ వెళుతున్నాడు. అలాంటి సుధీర్ బాబు నుంచి ఆయన తాజా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'హరోం హర' సినిమా రెడీ అవుతోంది. సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ సినిమాకి జ్ఞానసాగర్ దర్శకత్వం వహించాడు. మాళవిక శర్మ కథానాయికగా నటించిన ఈ సినిమా, ఈ నెల 14వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ ఊపందుకున్నాయి. ఈ సందర్భంగా సుమన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సుధీర్ బాబు అనేక విషయాలను ప్రస్తావించాడు. ఇంతవరకూ నేను 20 సినిమాలు చేశాను. వాటిలో ఐదారు సినిమాలకు సంబంధించిన ఫంక్షన్స్ లో మాత్రమే మహేశ్ బాబును ఆహ్వానించడం జరిగింది. ఆ తరువాత మహేశ్ బాబు ఎందుకు రావడం లేదా అని అంతా అనుకుంటున్నారు. ఒక స్థాయికి వచ్చేవరకు మాత్రమే నేను మహేశ్ సాయం తీసుకున్నాను. ఆ తరువాత కూడా ఆయన పేరును వాడుకుంటూ ఎదగాలని నేను అనుకోలేదు. ఇక ఒక కో స్టార్ గా .. బంధువుగా కూడా మహేశ్ చేసే సూచనలు కూడా సింపుల్ గానే ఉంటాయి" అని అన్నాడు.

## 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ విడుదల... తెలుగు సినిమానా, హాలీవుడ్ సినిమానా...?




ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సై–ఫై యాక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ చిత్రం నుంచి నేడు ఎనర్జిటిక్ ట్రైలర్ రిలీజైంది. తెలుగు వెండితెరపై ఇప్పటివరకు చూడని మరో ప్రపంచం ఆవిష్కరించారనడంలో సందేహం లేదు. పవర్ ప్యాక్డ్ ట్రైలర్ అంటే ఇదే అనిపించేలా ఉంది. కొన్ని వందల ఏళ్ల తర్వాత ప్రపంచం ఎలా ఉంటుందో, టెక్నాలజీ ఎంత ముందడుగు వేస్తుందో చూపించే ప్రయత్నం చేసినట్టు ట్రైలర్ చెబుతోంది. హాలీవుడ్ సినిమాలకు దీటుగా ఓ తెలుగు సినిమాను తెరకెక్కించడం మామూలు విషయం కాదు. ఎక్కడా బడ్జెట్ పరంగా వెనుకడుగు వేయకుండా కల్కి 2898 ఏడీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆ మేరకు ట్రైలర్ లో అంతర్జాతీయ స్థాయి నాణ్యత కనిపిస్తోంది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం జూన్ 27న వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. వైజయంతీ మూవీస్ పతాకంపై నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రంలో ప్రభాస్, దీపిక పదుకొణే, దిశా పటానీ, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, బ్రహ్మానందం తదితరులు నటిస్తున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188

# డిప్యూటీ సీఎం విక్రమార్కను కలిసిన కార్పొరేటర్ హమీద్ పటేల్



**శేరిలింగంపల్లి,జూన్ 11 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ని కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలవటం జరిగింది. ఈ సందర్భంగా కొండాపూర్ డివిజన్ లోని పలు సమస్యలు,అంశాలు గూర్చి వారి దృష్టికి తీసుకెళ్లి, చర్చించటం జరిగింది.

# అభివృద్ధి పనుల కోసం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి సూచన మేరకు పరిశీలించిన జోనల్ కమిషనర్



**శేరిలింగంపల్లి,జూన్ 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ లో నెలకొన్న సమస్యలు మరియు చేపట్టవలసిన అభివృద్ధిపనుల కోసం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శభరీష్ గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తో కలిసి ఈ రోజు గోపన్ పల్లి తాండ,గోపన్ పల్లి,రాజీవ్ నగర్ లలో పర్యటించారు. బస్తీల్లో చేపట్టవలసిన సిసి రోడ్లు, డ్రైనేజి పైప్ లైన్,వాటర్ పైప్ లైన్ ల ఏర్పాటు కు కావాల్సిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆమె అదేశించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు పెండింగ్ లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడలని అధికారులను అదేశించారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ చెరువుల సుందరికరణ,పార్క్ లు అభివృద్ధి చేపట్టాలని,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు కు కృషి చేయాలని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యుఎస్ డీజీఎం శరత్ కుమార్,ఈ ఈ.శ్రీనివాస్, డి ఈ.విశాలాక్షి,టౌన్ ప్లానింగ్ అధికారులు రవీందర్ రావు,రమేష్, హెచ్ఎండబ్ల్యుఎస్ మేనేజర్ అభిషేక్ రెడ్డి,ఏఎంఓహెచ్ నగేష్ నాయక్,రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్, సీనియర్ నాయకులు, రాజు,రమేష్,నర్సింగ్ నాయక్,ప్రసాద్,మహేష్,గోవర్ధన్,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాలు పరిశుభ్రత తో ఉంచుకోవాలి





**కూకట్ పల్లి, జూన్ 11(వార్తాప్రభ):**కూకట్ పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబీర్ లేక్ (చెరువు) లోని ప్రగతి నగర్ చెరువులోని మరియు (బేబీ) గుంత లోని కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ మేడం ఆదేశాలతో మరియు కూకట్ పల్లి జోన్ సీనియర్ ఎంటామాలజిస్ట్ సంధ్య మేడం సూచనలతో మంగళవారం అంబీర్ చెరువు సొసైటీ మెంబర్ నగేష్ మరియు జిహెచ్ఎంసి ఎంటమాలజీ సూపర్వైజర్ డి. నరసింహులు మరియు సిబ్బంది కే మురళి జె గిరి ఎస్ రమేష్ అంబీర్ చెరువు లోని (ప్రగతి నగర్ చెరువులోని) దోమల నివారణ చర్యలో భాగంగా దోమ పిల్లలను (అనగా లార్వా లను) అంతం (కంట్రోల్) చేయడానికి ఎం ఎల్ ఓ ఆయిల్ బాల్స్ వేయడం జరిగినది వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని ఎక్కడైతే ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటుందో అక్కడ దోమలు గుడ్లు పెట్టి దోమల ఉత్పత్తికి కారణం అవుతుంది కాబట్టి ఎక్కడైతే వర్షపు నీరు ఎక్కువ రోజులు నిలువ ఉన్నదో అట్టి గుంతలను ,మురికి చెరువులను, తనిఖీ చేసి అట్టి గుంతలలో మరియు మురికి చెరువులలో ఎం ఎల్ ఓ ఆయిల్, కానీ, పనికిరాని ఇంజన్ ఆయిల్ కానీ, కిరోసిన్ కానీ, గోనె సంచులలో (రంపపు) చెక్క పొట్టు పోసి గుండ్రగా రబ్బర్ బాల్ లాగా తయారుచేసి వాటికి ఒక తాడు సాయంతో ఎక్కడైతే పెద్ద పెద్ద గుంతలు ఎక్కువ రోజులు నీరు నిలువ ఉంటాయో అక్కడ తాడు సాయంతో వాటర్ లోకి ఆయిల్ బాల్స్ విడవ వలెను. అట్టి నిల్వ ఉన్న నీటిలో లో ఆయిల్ ఫామ్ అయి, దోమ పిల్లలు (లార్వలు) చనిపోవడం జరుగుతుంది దీనిద్వారా దోమల నియంత్రణ జరుగుతున్నది. వర్షాలు కురుస్తున్నాయి కాబట్టి ప్రతి ఒక్కరూ మన ఇంటి ఆవరణలో కానీ ఇంటి బయట గానీ ఎక్కువ రోజులు నీరు నిలువ లేకుండా చూసుకోవలెను ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ డ్రమ్ములు గాని సిమెంటు గోళాలు గాని నల్ల గుంతలు గాని పూల కుండీలు గాని టైర్లు గాని సంపులు గాని సింటెక్సు గాని పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు గాని వారానికి ఒకసారి తనిఖీ చేసి ఎక్కువ రోజులు నిలువ ఉన్న నీటిని తీసివేయవలెను ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి దోమ కాటు ద్వారా వచ్చే వ్యాధులు అనగా డెంగ్యూ ఫీవర్, మలేరియా, చికెన్ గునియా, పలేరియా, మెదడువాపు, బోధకాలు జింక వైరస్ ,మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ,జిహెచ్ఎంసి దోమల నివారణ సిబ్బంది (ప్రతిరోజు ప్రతి ఇంటి నీ తనిఖీ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రతి ఒక్కరు సహకరించవలసిందిగా ఏంటమలజీ సిబ్బంది కోరుతున్నారు.

# మూడోసారి మోడీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం



## బిజెపి శ్రేణుల సంబరాలు

**కూకట్ పల్లి, జూన్ 11 (వార్తాప్రభ)**:దేశప్రజలందరి ఆశీర్వాదంతో నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన పర్వాన్ని పురస్కరించుకొని బీజేవైఎం నాయకులు జీడిమడ్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ లో బిజెపి నాయకులు,ప్రజలు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి బాణాసంచ పేల్చి సంబరాలను జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోడీ హ్యాట్రిక్ విజయం వెనుక ప్రతి ఒక్క పౌరుడి నమ్మకం దాగి ఉంది అని ఇచ్చిన మాట తప్పని మోడీ సర్కార్ ప్రతి హామీని నెరవేరుస్తుంది అని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేయడం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు గర్వంగా తలెత్తుకొని బ్రతికేలా చేసేందుకు ఏ అవకాశాన్ని వదలకుండా ప్రతి భారతీయుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటు మోడీ సర్కార్ కృషి చేస్తుంది అని అన్నారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములై భారత్ ను విశ్వ గురువుగా చేసే మోడీ సర్కార్ సంకల్పంలో భాగంగా కేబినెట్ మంత్రిగా కిషన్ రెడ్డి,కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్,తో పాటుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయ పూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు.



# శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ



**శేరిలింగంపల్లి,జూన్ 11 (వార్తాప్రభ)**:గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీ లో గల శ్రీ సాయి బాబా దేవాలయం 14వ వార్షికోత్సవ మహోత్సవము కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ. శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారి ఆశీస్సులతో శ్రీ రుద్ర సహిత చండి యాగం నిర్వహించడం జరిగినది. అదేవిధంగా బాబా వారి సేవలో జోషి రాఘవేంద్ర శర్మ (పంతులు) 25 సంవత్సరాలు(సిల్వర్ జూబ్లీ) సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ చేతుల మీదుగా జోషి రాఘవేంద్ర శర్మ కి స్వర్ణ కంకణ ప్రదానోత్సవం కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో జీ తెలుగు శ్రీకరం శుభకారం తేజస్వి శర్మ,హిమాలయ తపస్వి సిద్ద యోగి,రాఘవేంద్ర శర్మ పంతులు,రవీందర్ రావు,రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్,రాగం అభిషేక్ యాదవ్,తిరుమలేష్,గోపాల్ యాదవ్,రాజు,మహేష్, రంజిత్,రవి కిరణ్,ఎంగయ్య గౌడ్,నగేష్,నారాయణ, మల్లికార్జున,దివ్య,కుమారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వెలికట్టే గ్రామంలో ఇటుక బట్టీల ఇష్టారాజ్యం

- పట్టించుకోని రెవెన్యూ మైనింగ్ ఇరిగేషన్ అధికారులు
- అధికారుల అండదండలే దీనికి కారణమా?
- అధికారుల కలెక్షన్లు ఫుల్ చర్యలు నీళ్లు అని స్థానికుల ఆరోపణలు
- బట్టీల పొగలతో బెంబేలెత్తిపోతున్న గ్రామనివాసులు
- ఎవడి పెళ్లి పెడాకులు అయితే నేమి మా ఇస్తారులో అన్నం పడితే చాలు అన్నట్టుగా అధికారుల తీరు
- ఖమ్మం నుండి వరంగల్ వెళ్లే జాతీయ రహదారి పై పొగల మూలంగా ఎదురొచ్చే వాహనం కనపడక ప్రమాదాలకు కేరాఫ్ గా మారిన వెల్లికట్టే



**తొర్రూర్ జూన్ 11(వార్తా ప్రభ)** ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కనే కృష్ణా జిల్లాకు చెందిన వ్యక్తులు వెల్లి కట్టే గ్రామ సమీపాన ఇటుక బట్టీలు ఇష్టారాజ్యంగా నిర్వహించడంతో గ్రామీణ ప్రజలు బట్టీల నుండి వచ్చే పొగలకు బెంబేలెత్తిపోతున్నారు. కానీ స్థానిక అధికారులు మాత్రం, కంచ చేను మేస్తే కాపు ఎవరు అన్న చందంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. అక్రమంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు అధికారుల అండదండలే కారణమా అనే ఆరోపణలు లేవనెత్తుతున్నాయి. పలుమార్లు గ్రామీణ ప్రజలు అధికారులకు విన్నవించుకున్న చర్యలు శూన్యమని స్థానికులు చెప్పుకొస్తున్నారు. గ్రామీణ ప్రజలు ఆ బట్టీల నుండి వచ్చే పొగలు దుమ్ము ధూళి వల్ల ఊపిరితిత్తుల సంబంధమైన వ్యాధులకు గురై దావఖాన పాలు అవుతున్నామని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ రెవెన్యూ మైనింగ్ ఇరిగేషన్ అధికారులు, తీరు మాత్రం" చెవిటోడి ముందు శంఖు ఊదిన చందంగా"ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు ఇటుక బట్టీల దందా ఐదు కోట్లకు పై పడే ఉంటదని అంచనా, ఇలాంటి అక్రమ ఇటుక బట్టిలా నిర్వాహకులకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని వదంతులు వినిపిస్తున్నాయి. కానీ స్థానిక ప్రజలు మాత్రం ఇది నిజమే అంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు లక్షలలో గండి కొడుతూ, అధికారులు జేబులు నింపుకుంటున్నారనే, నానుడి,ఇటుక బట్టీలనిర్వాహకులుచెరువులు కుంటల నుంచి అక్రమంగా రేగడి మట్టిని తరలించి ఇటుక బట్టి లకు వినియోగిస్తు కోట్ల రుపాయలు గడిస్తున్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల మాత్రం వారికి కొమ్ము కాస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కరెంటు, మట్టి నీరు ను ఇష్ట రాజ్యాంగ వాడుకున్న, అధికారులు వచ్చి కూడా పదివేల రూపాయలు ఫైన్ విధించి ప్రైవేట్ గా 50,000 వసూలు చేసుకుని పోతున్నారని, ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అప్పటికి రేగడి మట్టి దందా దారులు,గుంజ్జ కృష్ణ అనే వ్యక్తి ఎండిన చెరువులు కుంటలపై కన్నేసి ఏలాంటి అనుమతులు లేకుండా రేగడి మట్టి ని రాత్రి వేళలో జెసిబి సహాయంతో తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికే ఇటుక బట్టి లలో నిల్వ ఉంచిన రేగడి మట్టి ని చూస్తే కళ్ళు బైర్లు కమ్మే విధంగా ఉన్నాయి. ఇటుక బట్టిల్లో నిల్వ ఉంచిన రేగడి మట్టి ని చూస్తే దాదాపు 50నుండి 60ఎకరాల చెరువును తవ్వితే నే ఇంత రాగడిని నిల్వ చేయవచ్చని పలువురు అంచనా వేసి చెబుతున్నారు. ఇంతా మట్టి తరలిస్తున్న రెవెన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటుక బట్టి నిర్వహాకులపై చర్యలు తీసుకుంటారో లేక ఇంకా మాముళ్ళ మత్తులో ఉంటారో వేచి చుడాలని పలువురు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం.

**కూకట్ పల్లి, జూన్ 11 (వార్తాప్రభ)**గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కెపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం కె.పి.హెచ్.బి. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి చూడగా అతనికి సంబంధించిన ఆనవాలు ఏమీ లేకపోవడంతో ఆ వ్యక్తి ఎవరనేది తెలియకుండా ఉందని అతని వయసు 25 నుండి 30 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



# ఘనంగా అందెలా కిషోర్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



**శేరిలింగంపల్లి,జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):** శేరిలింగంపల్లి బ్రదర్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుక అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. అందేలా బ్రదర్స్ అయినా కుమార్ యాదవ్, కిరణ్ యాదవ్, కిషోర్ యాదవ్ ల ఆధ్వర్యంలో ఈ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా జరిగాయి. యువజన సంఘం సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు, కార్యవర్గ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ అందరు పాల్గొని ఈ జన్మ దిన వేడుకను వీక్షించి అభినందనలు తెలిపారు. కిషోర్ కుమార్ యాదవ్ మాతృశ్రీ లలితమ్మ నూరేళ్లు చల్లగా, హాయిగా బ్రతకాలని తన పుత్ర రత్నాన్ని ఆశీర్వదించి దీవించడం జరిగింది. వర్షాకాలపు చల్లని వాతావరణంలో యువజన సంఘ సభ్యులు, అభిమానులు, మిత్రమండలి కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా ఆనంద వాతావరణంలో కేక్ కట్ చేసి హ్యాపీ బర్త్డే అంటూ అందరూ ఎంజాయ్ చేయడం జరిగింది. యువజనులు అంతా హ్యాపీ బర్త్డే అంటూ కేరింతలు కొడుతూ కూల్ డ్రింక్స్ సేవిస్తూ డాన్సులు మరియు పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ జన్మదిన వేడుక గొప్పగా ఘనంగా జరుపుకోవడం జరిగింది. బ్రదర్స్ యూత్ అసోసియేషన్ బ్రహ్మ విష్ణు మహేశ్వర లాగా ఉన్న కుమార్ కిరణ్ కిషోర్ ల ఆధ్వర్యంలో జన్మదిన వేడుక స్వర్గసీమను తలపించే వాతావరణంలో జరిగింది. ఆనందంతో కేరింతలు కొడుతూ యూత్ మొత్తం పండుగ జరుపుకున్నారు. ఈ జన్మదినం వేడుకల్లో మాతృశ్రీ లలితమ్మ ఆశీస్సులతో కుమార యాదవ్, శీను, మనోజ్, కిరణ్ యాదవ్, కిషోర్ యాదవ్, యువజన సంఘం కార్యవర్గం సభ్యులు, అభిమానులైన గఫర్, రవి యాదవ్ మిత్ర బృందం, రవి యాదవ్, జావిద్ విజయ్, శ్రీను, యాదయ్య, మధు యాదవ్, పవన్, అజయ్ మిగతా సభ్యులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. పెద్దల ఆశీర్వాదం భోజనాల తర్వాత వేడుక ముగిసింది.

# జాతీయ అవార్డుకు ఎంపిక పట్ల ప్రశంసలు!!



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)**చాకలి ఐలమ్మ జాతీయ అవార్డుకు దావెనపల్లి రాజేశం ఎంపిక కావడం పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సోమవారం మహారాష్ట్ర పూణేలో బహుజన సాహిత్య అకాడమీ అందజేసిన అవార్డు స్వీకరించారు రాజేషం. ఆ అకాడమీ అధ్యక్షులు రాధాకృష్ణ అవార్డు ప్రధానం చేసి శాలువాతో సత్కరించారు. రాజేషం రాబోవు రోజుల్లో మరిన్ని అవార్డులు, రివార్డులు సొంతం చేసుకోవాలని పలువురు అభినందించారు.

# తాగునీటి సమస్యకు ట్యాంకరుతో పరిష్కారం!!

- డివిజన్ ప్రజల శ్రేయస్సు ముఖ్యం
- కొమ్ము వేణు, 45వ డివిజన్ కార్పొరేటర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జూన్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)**తాగునీటి సమస్యకు ట్యాంకరుతో తాత్కాలిక పరిష్కారం చూపించారు రామగుండం నగర పాలక సంస్థ 45వ డివిజన్ కార్పొరేటర్ కొమ్ము వేణు. ఈ మేరకు వేసవి కాలంలో రోజురోజుకు పెరుగుతున్న తాగునీటి సమస్య దృష్ట్యా మున్సిపల్ ట్యాంకర్ ద్వారా డివిజన్ ప్రజలకు సరిపడా తాగునీరు అందజేసి ఉపశమనాన్ని అందజేశారు కార్పొరేటర్. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొమ్ము మాట్లాడుతూ.... డివిజన్ ప్రజల శ్రేయస్సు, సమస్యల పరిష్కారం తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు. మంచినీరు సమస్య ఉన్నందున పొదుపుగా నీటిని వాడుకోవాలి అని ప్రజలకు సూచించారు.

# పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయాలి

**వరంగల్ జూన్ 11 , ( వార్త ప్రభ ప్రతినిధి ):**అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ నర్సంపేట మండలంలోని రామవరం ఎంపీపీ ఎస్, నర్సంపేట ఎంపీపీఎస్, ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా రూ. 24 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.